ఈనాడు అనంతపురం

బుధవారం అక్టోబరు 9, 2024



రోదిస్తున్న సీఐ నాగేంద్రప్రసాద్



నిందితుడు వెంకటేష్

నమ్మినవాడే.. నరహంతకుడు

ఎదురింట్లో కుర్రాడు...
పైగా సొంతూరి వాడే...
కుమారుడు దూరంగా ఉండడంతో
అతడినే కుమారుడిలా నమ్మింది

అమ్మలా ప్రేమను పంచింది
అతనూ కొడుకులా ఉంటూ నమ్మించాడు
ఆకలైనప్పుడు అన్నం పెట్టింది
అతడు చేతికున్న బంగారు గాజులు చూశాడు

కష్టం వస్తే అయ్యో అని ఆదరిస్తే
అతను ఆమె మెడలో నగలు చూశాడు
తల్లిలా మమతను పంచితే
అతనిలోని నరరూప రాక్షసుడు హతమార్చాడు

- అమ్మలా ఆదరిస్తే అంతమొందించాడు
- మదనపల్లెలో ధర్మవరం సీఐ తల్లిపై ఘాతుకం

మదనపల్లెలో సంచలనం సృష్టించిన శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం ఒకటో పట్టణ సీఐ నాగేంద్రప్రసాద్ తల్లి స్వర్ణకుమారి హత్యోదంతమిది. బిడ్డలా ఆదరించిన వ్యక్తే నిందితుడని తెలిసి అందరూ నివ్వెరపోవాల్సి వచ్చింది. ఈ ఉదంతం వెనుక వివరాలివి..


మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే: మదనపల్లెలోని జగన్‌కాలనీకి చెందిన స్వర్ణకుమారి (62) కుమారుడు నాగేంద్రప్రసాద్ శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం ఒకటో పట్టణ సీఐగా పనిచేస్తున్నారు. పట్టణంలో సొంతిల్లు ఉండడంతో తల్లి ఒక్కతే ఇక్కడ ఉంటోంది. వీరిది కలికిరి మండలం మేడికుర్తి. కాగా అదే గ్రామానికి చెందిన వెంకటేష్ అతని తల్లిదండ్రులు లక్ష్మమ్మ, సురేంద్ర కూడా మదనపల్లె పట్టణంలోని జగన్‌కాలనీలోనే నివాసం ఉంటున్నారు. స్వగ్రామం, పరిచయస్థులు కావడంతో వెంకటేష్ కుటుంబంతో ఆమె సన్నిహితంగా ఉంటోంది. తన కుమారుడు దూరంగా ఉండడంతో కొడుకు వయసున్న వెంకటేష్‌తో కావాల్సిన వస్తువులు తెప్పించుకునేది. అతను మాత్రం ఆమె నగలు కాజేయాలని పథకం వేసి తన స్నేహితుడైన నీరుగట్టువారిపల్లెలోని సాయిరాంవీధికి చెందిన అనీల్‌ను జత కలుపుకొన్నాడు. వీరిద్దరూ హత్యకు కుట్రపన్నారు. గత నెల 28న కాశీ నుంచి ఓ స్వామీజీ వచ్చాడని అతని వద్ద చూపించుకుంటే ఎలాంటి రోగాలైనా మటుమాయం అవుతాయని స్వర్ణకుమారిని నమ్మించారు. అక్కడికి వెళ్లిన ఆమెకు నిద్రమాత్రలు కలిపి ఉన్న తీర్థాన్ని తాగించారు. ఆమె మత్తులో ఉన్నట్లుగానే సుత్తితో తలపై కొట్టి చంపేశారు. అనంతరం ఆమె వద్ద ఉన్న నగలు తీసుకుని ఓ ఫైనాన్స్ సంస్థలో కుదువ పెట్టి రూ.4.30 లక్షలు నగదు తీసుకున్నారు. తిరిగి వచ్చి గోనె సంచిలో ఆమె మృతదేహాన్ని ఉంచి అయోధ్యనగర్‌లోని శ్మశాన వాటికలో ఓ సమాధిని సగం తవ్వి పూడ్చేసి వెళ్లిపోయారు. స్వర్ణకుమారి కుమారుడు నాగేంద్ర ప్రసాద్ తల్లి కన్పించలేదని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పది రోజులపాటు మదనపల్లె, శ్రీసత్యసాయి జిల్లా పోలీసులు విచారణ చేపట్టగా వెంకటేషే నిందితుడని నిర్ధారణ అయింది. మంగళవారం అతన్ని అరెస్టు చేసి పూడ్చిన శ్మశానానికి తీసుకెళ్లారు. అక్కడ మృతదేహం బయటపడింది.

మమతల తల్లి.. : స్వర్ణకుమారి తన భర్త రెండో వివాహం చేసుకోవడంతో అతనితో విభేదించి చిన్నప్పుడే కుమారుడు నాగేంద్రప్రసాద్‌తో మదనపల్లెకు వచ్చి కష్టపడి చదివించారు. అలా కుమారుడు హాకీ క్రీడాకారుడిగా సత్తా చాటి బీటీ కళాశాలలో డిగ్రీ పూర్తి చేశారు. క్రీడల కోటాలోనే ఎస్.ఐగా ఎంపికైన ఆయన ఉమ్మడి అనంతపురం జిల్లాలోనే ఎక్కువ కాలం పని చేసి ప్రస్తుతం సీఐగా ధర్మవరం ఒకటో పట్టణ ఠాణాలో విధులు నిర్వహిస్తున్నారు. కుమారుడితో కొన్నాళ్లు ఉండడం, సొంతిల్లు దెబ్బతింటుందని మదనపల్లెకు రావడం చేస్తుండేవారు. ఇంతలోనే నమ్మి ఆదరించిన వాడే నరరూప రాక్షసుడిగా మారి ఆమెను హతమార్చాడు. కుటుంబ సభ్యులు, బంధువులు, నాగేంద్రప్రసాద్ స్నేహితులు పెద్ద సంఖ్యలో అంత్యక్రియలకు హాజరుకావడంతో విషాదం అలముకుంది. ఇప్పటికి వెంకటేష్‌ను మాత్రమే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతనికి సహకరించిన అనీల్ పరారీలో ఉన్నాడు. హత్య జరిగిన రోజు అనీల్ తల్లి కూడా ఇంట్లోనే ఉండటంతో ఆమె కూడా సహకరించిందని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు. కాగా ఈ కేసులో మరింత లోతుగా విచారణ చేసి నిందితులు ఇంకా ఏమైనా నేరాలు చేశారా? అని తెలిసే అవకాశం ఉంది. పరారీలో ఉన్న నిందితుడు అనీల్ కోసం ఓ బృందం గాలిస్తోందని అతన్ని కూడా త్వరలోనే పట్టుకుంటామని రూరల్ సీఐ కళా వెంకటరమణ తెలిపారు.

నిత్యావసరాల అక్రమ నిల్వపై కఠిన చర్యలు

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: నిత్యావసరాల సరకుల అక్రమ నిల్వపై కఠిన చర్య తీసుకోవడంతోపాటు ఎక్కడికక్కడే సీజ్ చేస్తాం. ఆకస్మిక దాడులు చేసేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తున్నామని జేసీ శివ నారాయణ శర్మ పేర్కొన్నారు. మంగళవారం రైలు మిల్లర్లు, ఆయిల్ ట్రేడర్స్, పప్పు ధాన్యాల ట్రేడర్లు, రిటైల్ సంఘాలు, ఛాంబర్ ఆఫ్ కామర్స్, పౌర సరఫరాల ఉప తహసీల్దార్లతో సమావేశాన్ని నిర్వహించారు. హోల్ సేల్, రిటైల్, ట్రేడర్లు ప్రభుత్వానికి సహకరించాలని సూచించారు. సరకులను అక్రమంగా నిల్వ చేసినా, కృత్రిమ కొరతను సృష్టిస్తే తీవ్ర చర్య తీసుకుంటామని జేసీ హెచ్చరించారు.

సర్వీసులు ఇవ్వరు..




- కాళ్లరిగేలా తిరుగుతున్నా పట్టించుకోని విద్యుత్తు శాఖ అధికారులు

- పుట్టపర్తికి చెందిన వెంకటేశ్ పొలానికి కరెంటు సర్వీసు పొందేందుకు డీడీ తీసి దరఖాస్తు చేసుకున్నాడు. 8 నెలలుగా కార్యాలయం చుట్టూ తిరిగినా సామగ్రి ఇవ్వలేదు. సమస్యను ఏఈ నుంచి ఎస్ఈ వరకు అందరి దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదు. కండక్టరు, నియంత్రిక లేవని కారణాలు చెబుతున్నారన్నారు. పొలాన్ని చదును చేయించేందుకు రూ.65 వేలు ఖర్చు చేశానని కరెంటు లేకపోవటంతోనే పంట సాగు చేయలేకపోయానని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.
- అనంతపురం డీ-5 సెక్షన్ పరిధిలో 60 మంది గృహ సర్వీసులు పొందేందుకు వినియోగదారులు దరఖాస్తు చేసుకున్నారు. కొంతమంది సర్వీసులకు ఒకటి నుంచి రెండు, నాలుగు స్తంభాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. వీటికి కండక్టరు ఇవ్వాలి. మరికొన్ని సర్వీసులకు 25 కేవీ నియంత్రికలు ఏర్పాటు చేయాల్సి ఉంది. సదరు వినియోగదారులు విద్యుత్తు శాఖకు రూ.1.60 కోట్లు మొత్తాన్ని డీడీలు తీసి అందజేసినా 5 నెలలుగా పనులు పూర్తి చేయలేని పరిస్థితి.

స్టోర్‌లో ఏవీ లేవు..

జిల్లా స్టోర్‌లో అత్యవసరానికి కూడా 25 కేవీ నియంత్రికలు అందుబాటులో లేని పరిస్థితి. ఎక్కడైనా తీగలు తెగితే వాటికి అతుకులు వేసేందుకు కండక్టరు, కేబుల్ కూడా స్టోర్‌లో నిలువ లేదంటే పరిస్థితి ఎంత అధ్వానంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. రైతులు, వినియోగదారులు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా పట్టింపు లేదు.



ఉమ్మడి జిల్లావ్యాప్తంగా..

- వ్యవసాయ కనెక్షన్లకు దరఖాస్తులు: **15,295**
- డీడీల మొత్తం: **రూ.45.88 కోట్లు**
- అవసరం: **2,820 కిలోమీటర్లు కండక్టరు, 25 కేవీ సామర్థ్యం గల 4,320 నియంత్రికలు, 508 కిలోమీటర్ల కేబుల్**
- గృహ సర్వీసుల సామగ్రికి దరఖాస్తులు : **479**
- వీరు ఇచ్చిన డీడీలు: **రూ.1.67 కోట్లు**
- అవసరం : **152 కిలోమీటర్ల కండక్టరు, 1,960 విద్యుత్తు స్తంభాలు**
- వాణిజ్య సర్వీసులకు దరఖాస్తులు: **198**
- తీసిన డీడీలు: **రూ.89.10 లక్షలు**
- అవసరమైన సామగ్రి : **98 కిలోమీటర్ల కండక్టరు, 792 స్తంభాలు**
- మొత్తంగా కండక్టరు అవసరం: **7000 కి.మీ**
- అనుబంధ సామగ్రి: **ఏదీ అందుబాటులో లేదు.**

సామగ్రి లేదు!

అనంతపురం (విద్యుత్తు), న్యూస్‌టుడే

ఎక్కడి పనులు అక్కడే..

విద్యుత్తుశాఖలో వినియోగదారులు, రైతులకు సర్వీసులు విడుదల చేయటంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. శాఖకు డీడీలు అందజేసినా సకాలంలో సర్వీసులను విడుదల చేయని పరిస్థితి నెలకొంది. వ్యవసాయ సర్వీసులు, గృహ, వాణిజ్య సర్వీసులకు విడుదలకు, విద్యుత్తుశాఖ అభివృద్ధి (టీఅండ్‌టీ) పనులకు సంబంధించి ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. నియంత్రికలు, సామగ్రి, కండక్టరు, కేబుల్ వంటి వాటిని జిల్లా విద్యుత్తుశాఖ స్టోర్‌కు గత ఏడాది మార్చి నెల నుంచి విడుదల చేయలేదు. క్షేత్రస్థాయిలో పనులను విద్యుత్తు అధికారులు పూర్తి చేయలేని పరిస్థితి నెలకొంది. నిబంధనల ప్రకారం రైతులు, వినియోగదారులు డీడీలు తీసి అందజేసి సంబంధిత కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా పట్టించుకోవడం లేదు.

త్వరలోనే వస్తాయి..

- సంపత్‌కుమార్, ఎస్ఈ, విద్యుత్తుశాఖ

గత ఏడాది మార్చి నుంచి విద్యుత్తు సామగ్రి సరఫరా కావటం లేదు. కండక్టరు, కేబుల్ సరఫరా ఆగిపోయింది. జిల్లాలో రైతులు, వినియోగదారులు పడుతున్న ఇబ్బందులను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. త్వరలోనే విడుదల చేస్తామని తెలిపారు.

అక్రమార్కులపై వేటు!

డీఈ, ఏఈ సస్పెన్షన్

అనంత సంక్షేమం, న్యూస్‌టుడే: గృహ నిర్మాణాల్లో అక్రమాలకు తలూపారు. వైకాపా నేతలకు ఒక్కొక్కరికి రెండు, మూడు ఇళ్లు ఇచ్చి బిల్లులు చేశారు. వైకాపా ఎమ్మెల్యే చెప్పిందే వేదంగా రాప్తాడు నియోజకవర్గంలో ఇళ్ల నిర్మాణాల్లో భారీ ఎత్తున తప్పిదాలకు పాల్పడ్డారు. ఆఖరికి భార్య, భర్తలకు సైతం ఇళ్లు ఇచ్చి బిల్లులు చేసి ప్రభుత్వ ఖజానాకు గండి కొట్టారు. ప్రతి పక్షంలో ఉన్న మాజీ మంత్రి పరిటాల సునీత రాప్తాడు నియోజకవర్గంలో జరిగిన ఇళ్ల నిర్మాణాల్లో అక్రమాలపై విచారణ చేయాలని అప్పటి కలెక్టరు గౌతమిని కోరారు. ఈనేపథ్యంలో విచారణకు ఆదేశించారు. విచారణ చేసి అక్రమాలు నిజమేనని తేలినా చర్యలు చేపట్టకుండా నివేదికను తొక్కి పెట్టారు. వైకాపా నేతల ఒత్తిళ్లు, అప్పటి గృహ నిర్మాణశాఖ పీడీ వైకాపాతో ఉన్న సంబంధాలతో అక్రమార్కులను వెనకేసుకొచ్చే ప్రయత్నం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మరోసారి ఎమ్మెల్యే పరిటాల సునీత ముఖ్యమంత్రి చంద్రబాబు, లోకేశ్ దృష్టికి తీసుకెళ్లగా వెంటనే చర్యలు చేపట్టాలని ఆ శాఖ మంత్రి, ఎండీకి రెండు నెల్ల క్రితం ఆదేశాలు ఇచ్చారు. ఎట్టకేలకు అక్రమాలకు ఒడిగట్టిన అధికారులపై చర్యలకు ఉపక్రమించారు.

చర్యలతో అధికారుల్లో దడ

రాక్రీట్ సంస్థలో జరిగిన అక్రమాలపై ఇప్పటికే విజిలెన్సు దర్యాప్తు కొనసాగుతుండగానే రాప్తాడు నియోజకవర్గంలోని రాప్తాడు, ఆత్మకూరు, అనంతపురం గ్రామీణంలో జరిగిన ఇళ్ల నిర్మాణాల్లో భారీగా అక్రమాలు సాగాయని తేల్చారు. ఈ క్రమంలో అనంతపురం అర్బన్, రాప్తాడు డీఈగా పని చేసిన కృష్ణారావు, అనంతపురం గ్రామీణం ఏఈగా పని చేసిన వినోద్‌కుమార్‌ను సస్పెన్షన్ చేస్తూ గృహనిర్మాణ సంస్థ ఎండీ రాజబాబు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. అక్రమాల్లో భాగస్వామ్యమై వంత పాడిన మరో ఆరు మందికి ఛార్జి మెమోలు జారీ చేసి వారు చేసిన తప్పిదాన్ని బట్టి చర్యలు తీసుకోనున్నారు.



ధనలక్ష్మీ దర్శనం.. భక్తజన భాగ్యం!

జిల్లాలో శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. కళ్యాణదుర్గంలోని శ్రీకన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు మహాలక్ష్మీదేవిగా దర్శనమిచ్చారు. రూ.18,18,918 కరెన్సీ నోట్లతో అలంకరించారు. భక్తులు దర్శనం చేసుకుని తరించారు.

-న్యూస్‌టుడే, కళ్యాణదుర్గం

సీడబ్ల్యూఎస్ పథకాలతో.. జలజీవన్ మిషన్ అనుసంధానం చేయండి

కేంద్ర జలవనరుల శాఖ మంత్రిని కోరిన సత్యకుమార్ యాదవ్



కేంద్ర జలవనరుల శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌కు వినతిపత్రం అందజేస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్

ధర్మవరం, న్యూస్‌టుడే: ఉమ్మడి అనంతపురం జిల్లాలోని సీడబ్ల్యూఎస్ తాగునీటి పథకాలతో జలజీవన్ మిషన్‌ను అనుసంధానించి సమస్యను పరిష్కరించాలని కేంద్ర జలవనరుల శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌ను రాష్ట్ర వైద్యఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ కోరారు. ఈ మేరకు మంగళవారం దిల్లీలో కేంద్రమంత్రికి వినతిపత్రం అందజేశారు. కేంద్ర జలవనరులశాఖ మంత్రి కార్యాలయంలో ఆయనను కలసి జలజీవన్ మిషన్ అనుసంధానం గురించి చర్చించారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో భూగర్భ జలాల్లో ఫ్లోరైడ్ శాతం అధికంగా ఉందని, తాగడానికి కూడా వీలు కాకుండా ఉందన్నారు. పెన్నహోబిలం, చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ల నుంచి సత్యసాయి సమగ్ర రక్షిత మంచినీటి పథకాల ద్వారా నీరు అందుతోందన్నారు. సత్యసాయి నీటి సరఫరా బోర్డు పరిధిలోని 19 పథకాల ద్వారా జిల్లాలో తాగునీటి సరఫరా జరుగుతోందన్నారు. జలజీవన్ మిషన్‌ను సీపీడబ్ల్యూఎస్ పథకాలతో అనుసంధానిస్తే ఉమ్మడి జిల్లాలో ప్రతి ఇంటికీ తాగునీరు అందుతుందని కేంద్రమంత్రికి వివరించారు.

చీకట్లో ఇసుక తోడేస్తున్నారు

పెన్నానది నుంచి రోజుకు 40 ట్రాక్టర్లతో అక్రమంగా తరలింపు



ఒడ్డుపల్లి వద్ద టోల్‌ప్లాజా మీదుగా ఇసుకతో వెళ్తున్న ట్రాక్టరు

బెళుగుప్ప, ఉరవకొండ, న్యూస్‌టుడే : చీకట్లో ఇసుకను తోడేస్తూ.. దర్జాగా రహదారి మీదనే.. అదీ టోల్ ప్లాజాలో రుసుమును చెల్లించి తరలిస్తున్నా.. రెవెన్యూ, పోలీసు అధికార యంత్రాంగం తమకేమీ తెలియదన్నట్లు వ్యవహరిస్తుండటం విమర్శలకు తావిస్తోంది. పెన్నానదిని తోడేస్తున్నా అధికారులు మిన్నకుండిపోతున్నారు. ఇది అందరికీ తెలిసే జరుగుతున్నా.. దాన్ని కట్టడి చేయడం తమవంతు కాదన్నట్లుగా ఉంటున్నారు.. బెళుగుప్ప మండలం కాలువపల్లి గ్రామాన్ని ఆనుకుని పెన్నానది నది ప్రవహిస్తోంది. ఇక్కడ ఇసుక లభ్యత పుష్కలంగా ఉంది. పైగా నాణ్యమైంది. దీంతో అక్కడ లభించే ఇసుకకు డిమాండు అధికం. దీన్ని గుర్తించిన అక్రమార్కులు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ తతంగాన్ని స్థానికంగా ఉన్న కొందరు చోటామోటా నాయకులు నడిపిస్తున్నారు. అక్కడి నుంచి దాదాపు గత రెండు నెలలకు పైగా రోజూ రాత్రి 10 నుంచి ఉదయం 6 గంటల వరకు సుమారు 40 ట్రాక్టర్లలో ఇసుక అక్రమంగా తరలిస్తున్నారు. పెన్నానది పరివాహక ప్రదేశం నుంచి అనంతపురం నగరం 35 కిలో మీటర్ల దూరంలో ఉంది. అక్కడ ఇసుకకు డిమాండు అధికంగా ఉంటోంది. అక్రమార్కులు ప్రధాన రహదారిపైనే ఇసుకను అనంతపురానికి తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఎవరికీ కంట కనపడకుండా జరుగుతుందనుకుంటే పొరపాటే. ఆత్మకూరు మండలం ఒడ్డుపల్లి వద్ద ఉన్న టోల్‌ప్లాజా మీదుగా రవాణా సాగుతుండటం విశేషం.

రూ.లక్షల్లో అక్రమార్జన

రోజూ 40 ట్రాక్టర్లు.. ఒక్కో ట్రాక్టరు రెండు ట్రిప్పుల చొప్పున ఇసుక తరలిస్తున్నాయి. అనంతపురంలో ఒక్కో ట్రాక్టర్ ఇసుక రూ.6 వేలు పలుకుతోంది. ఈ లెక్కన రోజుకు 80 ట్రిప్పులకు రూ.4.80 లక్షలు ఆర్జిస్తున్నారు. ఈ మొత్తంలో కొంత మొత్తాన్ని కొందరు అధికారులకు ముట్ట చెబుతున్నారనే ఆరోపణలున్నాయి. దీని కారణంగానే వారు ఇసుక అక్రమ రవాణాను నియంత్రించే దిశగా చర్యలు చేపట్టడం లేదన్న విమర్శలున్నాయి.



ఇసుక లోడ్‌తో ప్రధాన రహదారిపై వెళ్తున్న ట్రాక్టర్లు

రైతుల ఆందోళన

బెళుగుప్ప మండలం కాలువపల్లి, వీరాంజనేయ కొట్టాల, హనుమరెడ్డిపల్లి, ఓబుళాపురం గ్రామాల రైతులు పెన్నానది పరివాహక ప్రాంతంలో వేల ఎకరాల్లో వివిధ రకాల ఉద్యాన పంటలతోపాటు, సాధారణ పంటలను బోర్ల కింద సాగు చేశారు. నది నుంచి లభించే భూగర్భ జలాలే పంటలకు దిక్కు. అయితే విచ్చల విడిగా అక్రమార్కులు ఇసుక తోడేస్తుండడంతో క్రమంగా భూగర్భ జలం అడుగంటుతోంది. ఇసుక తరలింపు అలాగే కొనసాగితే నీటి లభ్యత మరింత తగ్గే అవకాశం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం

- వినూత్న, అదనపు కలెక్టరు, కళ్యాణదుర్గం

బెళుగుప్ప మండలం కాలువపల్లి సమీపంలోని పెన్నానది పరివాహక ప్రదేశాల నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నారన్న అంశంపై స్థానిక అధికారులతో మాట్లాడి, దానిని పరిశీలించి, అడ్డుకట్ట వేయడానికి తగిన చర్యలు తీసుకుంటాం. ఇసుకను అక్రమంగా ఎవరు తరలించినా ఉపేక్షించేది లేదన్నారు.

14 నుంచి పల్లె పండగ

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే 'పల్లె పండగ' వారోత్సవాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. ఈ నెల 14 నుంచి 20వ దాకా జరిగే ఈ వారోత్సవంలో ప్రజాప్రతినిధులు పాల్గొంటారని చెప్పారు. మంగళవారం ఉప సీఎం పవన్ కల్యాణ్ వీసీ నిర్వహణ తర్వాత.. కలెక్టర్ జిల్లా అధికారులతో ప్రత్యేకంగా మాట్లాడారు. 'ఉపాధి' నిధుల సహకారంతో పల్లెల్లో రహదారుల నిర్మాణం, మరమ్మతులకు శ్రీకారం చుట్టాలి. భూమి పూజ, శంకుస్థాపనలు ఈ పల్లె పండగలో విస్తృతంగా సాగాలన్నారు. కూలీల సంఖ్యను పెంచడంతోపాటు.. సామగ్రి నిధుల వ్యయం కూడా పెరగాలన్నారు. కలెక్టర్ కోటా కింద ఇసుక వినియోగాన్ని పదిశాతం దాకా పెంచుకోవచ్చన్నారు. సిమెంటు బస్తాల ధరలపై జిల్లా స్థాయిలోనే కీలక నిర్ణయం తీసుకుంటామన్నారు. కరవు పీడిత ప్రాంతానికి అదనంగా ఏపీడీ పోస్టును అడిగామన్నారు. రూఫ్ టాప్ వాటర్ హార్వెస్టింగ్‌లో రాష్ట్రంలోనే జిల్లా ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. దీనిపై ఉప సీఎం ఆరా తీశారన్నారు. 206 పనుల్లో 144 పనులు ఇదివరకే పూర్తి చేశామన్నారు.

'మన బడి'కి చేయూతనిద్దాం

మనం చదివిన పాఠశాలలు, కళాశాలల అభివృద్ధికి చేయూతనిద్దామని కలెక్టర్ అన్నారు. మంగళవారం సమగ్ర శిక్షా, పాఠశాల, ఇంటర్, డిగ్రీ కళాశాలల అధికారులతో సమీక్ష నిర్వహించారు. విద్యా సంస్థల పూర్వ విద్యార్థులతో కలిసి ఒక వాట్సప్ గ్రూపు ఏర్పాటు చేసుకుంటే బాగుంటుందన్నారు. బలపం, పెన్సిల్, రబ్బర్‌తో మొదలుకుని ఏమేం కావాలో ఒక జాబితా తయారీ చేసుకోవాలి. తద్వారా పూర్వ విద్యార్థుల స్థాయిని బట్టి ఏమి ఇస్తారో తీసుకోండన్నారు. వారం రోజుల్లో కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు.

సహకార సంఘాల్లో ఎరువుల విక్రయం

జిల్లావ్యాప్తంగా ఉన్న సహకార సంఘాల కార్యాలయాల్లో విధిగా ఎరువుల విక్రయం కొనసాగాలి. ఇప్పటికీ ప్రారంభించిన చోట్ల సత్వరమే మొదలు పెట్టాలని కలెక్టర్ పేర్కొన్నారు. 34 సహకార సంఘాలు ఉంటే కేవలం 11 చోట్ల మాత్రమే ఎరువులు అమ్ముతున్నారు. తక్కిన 23 ప్రాంతాల్లో రానున్న నెల రోజుల్లో ఎరువుల విక్రయాలు మొదలు కావాల్సిందేనన్నారు.

గుత్తి తహసీల్దారు కార్యాలయానికి ఐఎస్ఓ గుర్తింపు

42 ప్రమాణాల పాటింపుతో దక్కిన వైనం

గుత్తి, న్యూస్‌టుడే : గుత్తి తహసీల్దారు కార్యాలయానికి ఐఎస్‌వో గుర్తింపు లభించింది. ఈ గుర్తింపు రావాలంటే 39 రకాల ప్రమాణాలను పాటించాల్సి ఉంది. అయితే గుత్తి తహసీల్దారు కార్యాలయంలో 42 ప్రమాణాలు పాటిస్తుండటం విశేషం. ఇది వరకు గుంతకల్లు ఆర్డీవో కార్యాలయానికి ఈతరహా గౌరవం దక్కింది. ఇప్పుడు ఆ జాబితాలో గుత్తి తహసీల్దారు కార్యాలయం చేరడంతో ప్రత్యేకతను సంతరించుకుంది. ఆర్డీవో శ్రీనివాసులురెడ్డి సూచనలతో కార్యాలయ అధికారులు, ఉద్యోగులు 42 ప్రమాణాలు పాటించారు. ప్రత్యేకంగా సిటిజన్ ఛార్టర్, రిసెప్షన్ కౌంటర్, కంప్యూటర్ నంబరింగ్, ఆర్టీఐ ప్రదర్శన బోర్డు, రికార్డు రూం నిర్వహణ తదితర అంశాలతో ప్రమాణాలు పాటించారు. మంగళవారం కలెక్టర్ వినోద్‌కుమార్ ఐఎస్‌వో ధ్రువీకరణ పత్రాన్ని తహసీల్దారు ఓబులేసుకు ప్రదానం చేశారు.



కలెక్టర్ చేతుల మీదుగా ధ్రువీకరణ పత్రాన్ని అందుకుంటున్న తహసీల్దారు ఓబులేసు

అభద్రతలో ఆపద్బాంధవులు!

- సామర్థ్య ధ్రువపత్రం, బీమా లేని 108
- అంబులెన్సుల నిర్వహణ తీరు అధ్వానం

హిందూపురం, మడకశిర, పెనుకొండ, న్యూస్‌టుడే: అత్యవసర సమయాల్లో, ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి ఆపద్బాంధవుల్లా తోడ్పడాల్సిన 108 వాహనాలు అభద్రతతో కొట్టుమిట్టాడుతున్నాయి. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని 66 వాహనాల్లో దాదాపు 52 వాహనాలకు 2022 నుంచి సామర్థ్య ధ్రువపత్రం (ఫిట్‌నెస్ సర్టిఫికెట్), బీమా లేకున్నా యాజమాన్యం పట్టించుకోవటం లేదన్న ఆరోపణలు వస్తున్నాయి. ఎక్కడైనా ప్రమాదాల బారిన పడితే పైలెట్‌నే బాధ్యుడిని చేస్తున్నారు. ఏపీ39 టీఎల్ సీరియల్ నంబరు ఉన్న 108 వాహనాలే ఉమ్మడి జిల్లాలో అధికంగా ఉన్నాయి. వాటిల్లో ఒక్క వాహనానికీ సామర్థ్య, బీమా లేదు. ఒక్కో వాహనం దాదాపు 5లక్షల కి.మీ వరకు తిరిగినా కొనసాగిస్తున్నారు. తొలుత జీవీకే, అనంతరం జీవీజీ తర్వాత అరబిందో ఎమర్జెన్సీ మెడికల్ సర్వీసెన్ వారు నిర్వహిస్తున్నారు.

తరచూ మరమ్మతులు

ఉమ్మడి జిల్లాలో మండలానికి ఒక 108 వాహనం ఉంది. ఒక్కో వాహనం రోజుకు సుమారు 300 కిలోమీటర్ల మేర రాకపోకలు సాగిస్తుంటుంది. అనంతపురంలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి రెఫర్ కేసులు ఉంటాయి. ఇలాంటి సమయంలో వాహనాలకు భద్రత ఎంతో అవసరం. మరోవైపు 90 శాతం వాహనాలు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయి. ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారిని తరలించే సమయంలో వాహనం ఆగిపోయినా, ప్రమాదానికి గురైనా తీరని నష్టం కలుగుతోంది. గతనెల 22న లేపాక్షి మండలం గొంగటిపల్లి వద్ద ద్విచక్రవాహనంలో అశ్వర్థప్ప వెళుతుండగా శునకాల దాడికి యత్నించాయి. తప్పించుకొనే క్రమంలో 108 వాహనాన్ని ఢీకొన్నాడు. 108 వాహనం ఆగిపోగా.. పైలెట్‌ను విధులకు దూరంగా ఉంచారు.



సామర్థ్యం, బీమా లేని 108 వాహనం

వెంటనే చేయించాలి

108 వాహనాలకు ఫిట్‌నెస్, బీమా లేని విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. అలాంటి వాహనాలకు సామర్థ్య పరీక్ష చేయించి ధ్రువపత్రం తీసుకోవాల్సి ఉంది. అలాగే బీమా తప్పనిసరిగా చేయించాలి.

- కరుణాసాగర్‌రెడ్డి, జిల్లా రోడ్డు రవాణా శాఖ అధికారి, శ్రీసత్యసాయి జిల్లా

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం

వాహనాలకు సంబంధించి ఫిట్‌నెస్, బీమా విషయంపై యాజమాన్యం, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. సమస్య పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటాం.

- కొండారెడ్డి, ఉమ్మడి జిల్లా ఇన్‌ఛార్జి 108 మేనేజర్, అనంతపురం

అనంతపురం ఆర్డీఓ రాక అనుమానమే !

తపోవనం (అనంత గ్రామీణం), న్యూస్‌టుడే: అనంతపురం ఆర్డీఓగా జి.కేశవనాయుడు బాధ్యతలు చేపట్టడంపై అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం పార్వతీపురంలో పనిచేస్తున్న ఆయనను బదిలీల్లో భాగంగా అనంతపురం ఆర్డీఓగా నియమిస్తూ గత నెలలోనే ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఉత్తర్వుల ప్రకారం ఈనెల మొదటి వారంలోనే బాధ్యతలు చేపడతారని అందరూ ఊహించారు. ఆయన ఇక్కడికి రావడానికి అయిష్టంగా ఉన్నట్లు తెలుస్తోంది. అనంతపురం కాకుండా మరో డివిజన్ కోసం ప్రయత్నం చేస్తున్నట్లు తెలిసింది. ప్రస్తుతం అనంతపురం ఆర్డీఓగా ఉన్న వసంతబాబును కళ్యాణదుర్గం బదిలీ చేశారు. అనంతపురం డివిజన్ చాలా కీలకం కావడంతో ఎవరో ఒకరిని నియమించే వరకు ఇక్కడ్నుంచి రిలీవ్ చేయడానికి అవకాశం లేదు. గతంలో కేశవనాయుడు ఆర్సెట్ సీఈఓగా, జిల్లాలోని పలు మండలాల్లో తహశీల్దారుగా పనిచేశారు. గతంలో ఆర్డీఓగా పనిచేసిన జి.వెంకటేష్‌ను బదిలీ చేసిన తర్వాత వసంతబాబును ఇన్‌ఛార్జిగా కొనసాగిస్తున్నారు. అనంతపురం ఆర్డీఓగా ఇతనికే అవకాశం వస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. కళ్యాణదుర్గం ఆర్డీఓగా మరొకరిని నియమించే అవకాశాలు మెండుగా ఉన్నాయి. బదిలీల మార్పు ఎపుడు జరుగుతుందో అర్థం కాని పరిస్థితి చోటు చేసుకుంది. రెగ్యులర్ ఆర్డీఓ లేకపోవడం వల్ల అనేక పనులు అర్ధాంతరంగా ఆగిపోతున్నాయి. సామాజిక పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను సైతం పరిష్కరించలేకపోతున్నారు.

జాతీయస్థాయి జూడోలో కాంస్య పతకం

ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని చిగిచెర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన అప్జల్ మెహరాజ్ జాతీయ స్థాయి జూడో పోటీలో కాంస్య పతకం సాధించాడు. మంగళవారం పాఠశాల పీడీ ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ ఈనెల 4 నుంచి 8వ తేదీ వరకు గుజరాత్ మెహసనలోని సర్దార్ వల్లభాయ్ పటేల్ స్టేడియంలో జూడో జాతీయ స్కూల్ గేమ్స్ పోటీలు జరిగాయన్నారు. అండర్-14లో 50 కేజీ విభాగంలో అప్జల్ మెహరాజ్ రాష్ట్రం నుంచి ప్రాతినిథ్యం వహించాడు. దేశవ్యాప్తంగా 26 రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులతోపాటు, కేంద్రపాలిత ప్రాంతాల క్రీడాకారులు పాల్గొన్నారని పీడీ వివరించారు. ఈ సందర్భంగా విజేతను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తిమ్మారెడ్డి, గ్రామస్థులు అభినందించారు.



అప్జల్ మెహరాజ్‌తో పీడీ ప్రతాప్‌రెడ్డి

కంది పంటను కాపాడుకుందాం

అనంతపురం (వ్యవసాయం): జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్‌లో సాగైన కంది పంట ఆశాజనకంగా ఉంది. ప్రస్తుత వాతావరణ పరిస్థితులతో తెగులు ఆశించే అవకాశం ఉందని అనంతపురం వ్యవసాయ సబ్ డివిజన్ ఏడీఏ రవి సూచించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం అనంతపురం గ్రామీణం అక్కంపల్లి, రాచానపల్లి గ్రామాల్లో వేరుసెనగ కంది పంట పొలాలను సందర్శించారు. పంటను పూత, కాయ దశలో కాపాడుకుంటే మేలైన దిగుబడులు వస్తామన్నారు.

రానున్న ఐదు రోజుల్లో తేలికపాటి వర్షాలు

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే : ఉమ్మడి అనంతపురం జిల్లాలో రానున్న ఐదు రోజుల్లో చిరుజల్లులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని రేకులకుంట వాతావరణ కేంద్రం శాస్త్రవేత్తలు విజయశంకర్ బాబు, నారాయణస్వామి తెలిపారు. వచ్చే ఐదు రోజులు జిల్లాలో పగటి ఉష్ణోగ్రతలు 32.5 నుంచి 34.8 డిగ్రీలుగానూ, రాత్రి ఉష్ణోగ్రతలు 23.5 నుంచి 24.6 డిగ్రీలుగా నమోదవుతాయన్నారు. ఆగ్నేయం దిశగా గాలులు గంటకు 12 కిలోమీటర్ల వేగంతో వీస్తాయన్నారు. ఉదయం పూట గాలిలో తేమ 83 శాతం, మధ్యాహ్నం పూట 65 శాతం ఉంటుందన్నారు. నల్లరేగడి భూముల్లో పప్పుశనగ పంట విత్తుకోవడానికి అనువైన సమయమని రైతులు విత్తుకోవడానికి ప్రయత్నాలు చేసుకోవాలని శాస్త్రవేత్తలు తెలిపారు.

మంత్రి కార్యాలయ ఇన్‌ఛార్జి వాహనంపై దాడి

ధర్మవరం, న్యూస్‌టుడే: ధర్మవరం శివానగర్‌లో వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ కార్యాలయ ఇన్‌ఛార్జి హరీష్‌కు చెందిన స్కార్పియో వాహనంపై దాడి జరిగింది. హరీష్ నివాసం ఉంటున్న ప్రాంతంలో రహదారి పక్కన పార్కింగ్ చేసిన వాహనంపై గుర్తు తెలియని యువకుడు రాయితో దాడి చేసి ద్విచక్ర వాహనంలో పరారయ్యాడు. స్కార్పియో వాహనం అద్దం ఒకవైపు పగిలింది. విషయం తెలుసుకున్న హరీష్ 1వ పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని చేరుకొని పరిశీలించారు. వాహనం వద్ద పడి ఉన్న రాయిని పరిశీలించారు. స్థానికంగా ఉన్న సీసీ కెమెరాలను పోలీసులు పరిశీలించారు. దాడి అనంతరం ఒక యువకుడు ద్విచక్ర వాహనంలో పరారీ కావడాన్ని గుర్తించారు. 1వ పట్టణ పోలీసులు వివరాలు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



పగిలిన స్కార్పియో వాహనం అద్దం

విధుల్లో చేరిన హెచ్చెల్సీ ఉప ఎస్ఈ

అనంతపురం(శ్రీనివాస్‌నగర్): హెచ్చెల్సీ ఉప ఎస్ఈగా సూర్య భాస్కర్‌శర్మ పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడి పని చేసిన సునీల్ నాయక్ తిరుపతి తెలుగు గంగ ఉప సీఈగా బదిలీపై వెళ్లిన సంగతి తెలిసిందే. పోలవరం ప్రాజెక్టులో పని చేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చిన సూర్య భాస్కర్ శర్మ ఇక్కడి విధుల్లో చేరారు. మరోవైపు.. కీలకమైన హెచ్చెల్సీ లోకలైజేషన్ డివిజన్ ఈఈగా ఆర్ఎస్ఆర్ పుల్లారెడ్డి కూడా బాధ్యతలు తీసుకున్నారు.

ఎంబీబీఎస్ సీటు ఇప్పిస్తానని మోసం

యాడికి, న్యూస్‌టుడే : వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ సీటు ఇప్పిస్తానని నమ్మబలికి ఓ విద్యార్థిని తండ్రితో రూ.లక్షలు ఇప్పించుకుని మోసం చేసిన ఘటనపై బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. బాధితుడు తెలిపిన వివరాల మేరకు..యాడికిలో వెల్డింగ్ పని చేసుకుంటున్న యజ్దానిబాషా తన కూతురు వి.ఆరీఫాను 22-23 సంవత్సరంలో వైద్య విద్య అభ్యసించడానికి ఉపక్రమించాడు. దీనికి గాను తెలిసిన మిత్రుడితో కలిసి న్యూ వే ఎడ్యుకేషన్స్ సర్వీసెస్‌ను సంప్రదించారు. సంస్థ నిర్వాహకులు విజయనగరానికి చెందిన సరితి గణేశ్, సరితి రామారావుతో మాట్లాడారు. ఫిలిప్పీన్స్ దేశంలోని యూవీ గుల్లాస్ యూనివర్సిటీలో ఎంబీబీఎస్ అడ్మిషన్ చేయిస్తామని, మొదటి సంవత్సరానికి గాను ఫీజు రూ. 6.75 లక్షలు అవుతుందని చెప్పారు. వారి మాటలు నమ్మిన యజ్దానిబాష తొలి విడతగా రూ.3.30 లక్షలు ఫోన్‌పే ద్వారా చెల్లించారు. ఇప్పటి వరకు తరగతులు నడవటం లేదంటూ చెప్పుకొంటూ వచ్చారు. ఆలస్యం కావడంతో తీవ్ర బాధితుడు ఒత్తిడి పెంచాడు. దీనికి గాను అడ్మిషన్ చేసినట్లు ధ్రువపత్రాలు ఇచ్చారు. వీటిని ఫిలిప్పీన్స్ కళాశాలకు సంబంధించి చెన్నైలో నడుస్తున్న నీయోలైఫ్ కన్సల్టెన్సీని సంప్రదించడంతో పాటు, ఆ దేశంలోని కళాశాలలో చదువుతున్న తెలిసిన విద్యార్థులకు పత్రాలు పంపించగా, ఆరీఫా పేరు మీద అడ్మిషన్ జరగలేదని, నకిలీ ధ్రువపత్రాలు ఇచ్చారని తెలిసిపోయింది. దీనిపై సంస్థ నిర్వాహకులను నిలదీయగా దిక్కున్న చోట చెప్పుకోండంటూ భయపెట్టారు. కూతురి విద్యా సంవత్సరం వృథా కావడమే కాకుండా ఇచ్చిన డబ్బులు తిరిగి ఇవ్వడం లేదని, తాను మోసపోయానని గ్రహించి ఎస్పీ కార్యాలయాన్ని ఆశ్రయించాడు. దీనిపై పరిశీలన చేపట్టాలని ఎస్పీ కార్యాలయం నుంచి ఆదేశాలు రావడంతో యాడికి సీఐ ఈరన్న బాధితుడిని పిలిపించి విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం విజయనగరంలోని సంస్థ నిర్వాహకులను పిలిపించే విషయంపై చర్యలు చేపట్టారు.

బాలికపై శునకాల దాడి

అమడగూరు, న్యూస్‌టుడే: మండలంలోని జౌకలకొత్తపల్లికి చెందిన ఎనిమిదో తరగతి చదువుతున్న శ్రీనిధిరాయ్ అనే బాలికపై మంగళవారం శునకాలు దాడి చేయడంతో గొంతు, ముఖంపై గాయాలయ్యాయి. బాలిక తల్లిదండ్రులు, గ్రామస్థులు తెలిపిన మేరకు వివరాలు.. బాలిక ఆరుబయట నిలబడి ఉండగా ఒక్కసారిగా వీధి కుక్కలు దాడి చేసి గాయపరిచాయి. అప్రమత్తమైన తల్లిదండ్రులు శునకాలను తరిమివేశారు. గతంలో కూడా చినగానిపల్లి, అమడగూరు, మహమ్మదాబాద్, చిన్నపానిపల్లి గ్రామాల్లో వీధి కుక్కలు చిన్నారులు, ప్రజలపై దాడులు చేసి గాయపరిచాయి. మహమ్మదాబాద్ గ్రామ పొలానికి వచ్చిన ధర్మవరం గొర్రెల కాపరులకు చెందిన దాదాపు 100 గొర్రె పిల్లలు వీధికుక్కల దాడిలో చనిపోయాయి. గ్రామాల్లో చికెన్ దుకాణాల వద్ద వచ్చి మాంసం తినటానికి అలవాటు పడిన కుక్కలు ప్రజలపై దాడులు చేస్తున్నట్లు స్థానికులు తెలిపారు. అధికారులు స్పందించి శునకాలు గ్రామాల్లో లేకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



గాయపడిన శ్రీనిధిరాయ్

కుటుంబ కలహాలతో బలవన్మరణం

నల్లమాడ, న్యూస్‌టుడే: కుటుంబ కలహాలతో మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని బొగ్గలపల్లికి చెందిన గుర్రప్పకు దొన్నికోట గ్రామానికి చెందిన గంగమ్మ(40)తో 20 ఏళ్ల కిందట వివాహం జరిగింది. అప్పటి నుంచి వారి కాపురం అన్యోన్యంగా సాగింది. నెల రోజుల కిందట బతుకు తెరువు కోసం గంగమ్మ, గుర్రప్ప దొన్నికోటకు వెళ్లి అక్కడే కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగించేవారు. ఈనెల 7న కుటుంబ విషయంలో భార్యాభర్తలిద్దరూ వాదులాడుకున్నారు. దీంతో మనస్తాపానికి గురైన గంగమ్మ విష ద్రావణం తాగి స్పృహ కోల్పోయింది. భర్త ఆమెను 108 సాయంతో కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి అక్కడి నుంచి అనంతపురం ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మంగళవారం మృతి చెందింది. మృతురాలి తండ్రి రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ దాదాకలందర్ తెలిపారు.

ట్రాక్టరు బోల్తా.. ఇద్దరు యువకుల దుర్మరణం

ఐదుగురికి గాయాలు

తలుపుల, న్యూస్‌టుడే: విద్యుత్తు సామగ్రి తీసుకెళ్తూ ట్రాక్టరు అదుపుతప్పి బోల్తా పడటంతో జార్ఖండ్‌కు చెందిన యువకులు సునీల్ (28), దనియాల్ (26) సంఘటనా స్థలంలోనే మృతి చెందగా, మరో ఐదుగురు గాయపడినట్లు ఏఎస్సై కృష్ణారెడ్డి తెలిపారు. వివరాలు.. తలుపుల మండలం తొగటవాండ్లపల్లికి చెందిన విద్యుత్తు కాంట్రాక్టరు సిద్ధార్థనాథ్‌రెడ్డి నంబులపూలకుంట మండలంలో విద్యుత్తు పనులు చేస్తున్నప్పుడు వాటికి సంబంధించిన సామగ్రిని ఇంటివద్దనే నిల్వ ఉంచుకున్నారు. దాదాపు 2 నుంచి 3 టన్నుల బరువు కలిగిన విద్యుత్తు తీగల బండిల్, ఇతర సామగ్రిని పని ప్రదేశానికి మంగళవారం సాయంత్రం ట్రాక్టరులో తీసుకెళ్తూ పోలేరమ్మ ఆలయ సమీపంలో ఎదురుగా వస్తున్న ఆటోను తప్పించే క్రమంలో ట్రాక్టరును రోడ్డు దింపడంతో బండిల్ ఒకవైపు దొర్లిపోయింది. ఆ తూకానికి ట్రాక్టరు తొట్టి బోల్తా పడింది. అందులో ఉన్న సునీల్, దనియాల్ సామగ్రి కింద పడి అక్కడికక్కడే మృతిచెందారు. మరో ఐదుగురు గాయపడటంతో వారిని కదిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు. కదిరి గ్రామీణ సీఐ మోహన్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై వివరించారు.



బోల్తాపడిన ట్రాక్టర్



విద్యుత్తు సామగ్రి కింద నలిగిపోయిన సిబ్బంది

కాజేసిన భూములకు గుట్టుగా రిజిస్ట్రేషన్

- రియల్టర్లే రైతుల భూములు విక్రయించిన వైనం
- నిలదీసిన బాధితులు

చెన్నేకొత్తపల్లి, న్యూస్‌టుడే: సీకేపల్లి మండలం న్యామద్దల గ్రామ సమీపంలో ఓ ప్రైవేట్ సంస్థ మూడేళ్లుగా నిర్మాణాలు చేపడుతోంది. ఆ కంపెనీ ప్రతినిధులు వంద ఎకరాల చెరువు ఆయకట్టు భూములను కొనుగోలు చేసి కంపెనీ ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ఇదే అదనుగా భావించిన కొందరు రియల్టర్లు అమాయకులైన కొందరు రైతులకు చెందిన పట్టా భూములకు యజమానులు తామేనంటూ విక్రయించారు. మూడేళ్ల క్రితం రిజిస్ట్రేషన్ చేయించారు. ఈ విషయం తెలియని కంపెనీ ప్రతినిధులు రైతుల భూములు తమవిగా భావించి స్వాధీనం చేసుకుని నిర్మాణాలు సాగిస్తున్నారు. కొందరు రైతులు తమ పంట రుణాలను నవీకరించేందుకు బ్యాంకులకు వెళ్లగా మీ భూమిని ఓ కంపెనీకి విక్రయించినట్లు తెలపడంతో వారు నివ్వెరపోయారు. ఇదేంటని కంపెనీ ప్రతినిధులను నిలదీయగా.. తమకు సంబంధం లేదని విక్రయించిన వారిని సంప్రదించాలని సూచించినట్లు తెలిసింది. రియల్టర్లకు వద్దకు వెళ్లి తమ భూములను విక్రయించడానికి మీరెవరని ప్రశ్నించగా లెక్కలేకుండా మాట్లాడటంతో చేసేది లేక రెవెన్యూ, పోలీస్ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఈ తతంగమంతా గత వైకాపా ప్రభుత్వంలోనే సాగినట్లు, రియల్టర్లు కూడా అదే పార్టీకి చెందిన వారు కావడంతో అధికారులు సైతం వారిపై చర్యలు తీసుకునేందుకు వెనకాడినట్లు తెలుస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో బాధిత రైతుల నుంచి తాము ఎక్కడ ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందోననే ఉద్దేశంతో రియల్టర్లు వారు తమ పేర్లతో విక్రయించిన భూములను మంగళవారం తిరిగి పలువురు బాధిత రైతులకు సీకేపల్లి రిజిస్ట్రేషన్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపట్టారు. విషయం తెలుసుకున్న మరికొంతమంది బాధిత రైతులు అక్కడికి చేరుకుని తమకు న్యాయం చేయాలని కంపెనీ ప్రతినిధులు, రియల్టర్లను నిలదీశారు. అప్పటికే రిజిస్ట్రేషన్ తతంగం ముగియడంతో వారు అక్కడి నుంచి జారుకున్నారు. ఈ విషయాన్ని ఇన్‌ఛార్జి సబ్ రిజిస్ట్రార్ అనిల్‌కుమార్ దృష్టికి తీసుకుపోగా ఇద్దరు రైతులకు సంబంధించిన భూముల రిజిస్ట్రేషన్‌ను పెండింగ్‌లో ఉంచినట్లు తెలిపారు.

లారీ ఢీకొని ఒకరి మృతి

అమరాపురం, న్యూస్‌టుడే: అమరాపురం మండలం బసవనపల్లి వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో పావగడ తాలూకా చిక్కతిమ్మనహట్టి గ్రామానికి చెందిన అందజినప్ప కుమారుడు తిప్పేస్వామి(48) అక్కడికక్కడే మృతి చెందాడు. మడకశిర నుంచి అమరాపురం వైపు ద్విచక్ర వాహనంలో వస్తున్న తిప్పేస్వామిని అయ్యప్పస్వామి ఆలయ సమీపంలో ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తలకు తీవ్రమైన గాయాలు తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఏఎస్సై రామాంజినేయులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. బాధితులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయనున్నట్లు ఏఎస్సై తెలిపారు.

మామిడితోటలో మహిళ హత్య

మూడ్రోజుల కిందటే జరిగినట్లు అనుమానం



రామలక్ష్మమ్మ

అమడగూరు, న్యూస్‌టుడే: మండలంలోని సుబ్బయ్య నారవ సమీపంలోని మామిడి తోటలో కాపలాగా ఉన్న పెనుకొండకు చెందిన రామలక్ష్మమ్మ (52) అనే వివాహిత హత్యకు గురైంది. పోలీసులు, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు వివరాలు.. మహమ్మదాబాద్ గ్రామానికి చెందిన కృష్ణమూర్తి విజయవాడలో సీసీఎస్‌లో ఏఎస్సైగా పనిచేస్తున్నారు. ఆయనకు అమడగూరు, ఓబుళదేవరచెరువు మండలాల సరిహద్దులో సుబ్బయ్యనారవ సమీపంలో మామిడితోట ఉంది. ఏడాది నుంచి పెనుకొండకు చెందిన రామలక్ష్మమ్మ నెల వేతనం కుదుర్చుకుని తోటతోపాటు పాడి ఆవు సంరక్షణ చేసుకొంటూ అక్కడే జీవిస్తోంది. కుమారుడు పురుషోత్తం, కోడలు కదిరి కుటాగుళ్లలో నివాసం ఉంటున్నారు. తల్లిని చూడటానికి మంగళవారం తోట వద్దకు వచ్చిన పురుషోత్తం రక్తపు మడుగులో విగతజీవిగా పడి ఉండటంతో సమీపంలోని రైతుల సహాయంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. కదిరి డీఎస్పీ శివనారాయణ స్వామి సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. ఆదివారం రామలక్ష్మమ్మను బయటనే పారతో హత్య చేసి మృతదేహాన్ని గదిలోకి తీసుకెళ్లి మంచంపై పడేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. హత్యకు వాడిన పార, వివిధ వస్తువులను స్వాధీనం చేసుకొన్నారు. తోట యజమానికి, బంధువులకు భూమికి సంబంధించిన సమస్యలు ఉన్నట్లు సమాచారం. మృతురాలి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొన్నట్లు కదిరి, నల్లమాడ సీఐలు సునీత, మోహన్, ఎస్సై వెంకటనారాయణ తెలిపారు. వివిధ కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు. కానిస్టేబుళ్లు సూర్యనారాయణ, జబీవుల్లా, ఈశ్వర్ పాల్గొన్నారు.



సంఘటనా స్థలంలో విచారణ చేస్తున్న పోలీసులు

భర్త వేధింపులపై కేసు

కదిరి పట్టణం, న్యూస్‌టుడే: కదిరి ఆర్టీసీ బస్టాండులో సొంత కూతురును వదిలివెళ్లిన జ్యోతి ఫిర్యాదు ఆధారంగా ఆమె రెండో భర్తపై కదిరి అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు.. గుమ్మఘట్ట మండలానికి చెందిన జ్యోతి మొదటి భర్త మరణించడంతో ఉపాధి కోసం కర్ణాటకకు వెళ్లి అక్కడ కుమార్ అనే వ్యక్తిని రెండోపెళ్లి చేసుకుంది. వీరిద్దరికి కూతురు పుట్టింది. భర్త వేధింపులు తాళలేక బిడ్డతో పాటు ఆమె కర్ణాటక నుంచి కదిరికి వచ్చేసి బస్టాండులో పాపను మరో యువతికి అప్పగించి వెళ్లిన విషయం తెలిసిందే. భర్త వేధింపులు తాళలేక ఆత్మహత్య చేసుకోవాలన్న ఆలోచనతోనే పాపను వదిలివెళ్లినట్లు జ్యోతి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆమె రెండోభర్త కుమార్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ నారాయణ రెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

అనంతపురం(కమలానగర్): అనంత గ్రామీణం సోములదొడ్డికి చెందిన ముగ్గురు మిత్రులతో కలిసి హాజీవలి(19) ఉదయం ఇస్కాన్ ఆలయ సమీపంలో రోడ్డులో నడుచుకుంటూ వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన ఐచర్ వాహనం హాజీవలిని ఢీ కొట్టింది. అతనికి తీవ్ర గాయాలు కావడంతో మిత్రులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు రూరల్ పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రామకృష్ణారెడ్డి తెలిపారు.

పోక్సో కేసులో నిందితుడికి రిమాండ్

అనంతపురం(బళ్లారిరోడ్డు): అనంతపురం శివారులోని జాకీర్‌కొట్టాలకు చెందిన రవీంద్ర ఏడేళ్ల బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించినందుకు పోక్సో కేసు నమోదు చేసినట్లు రూరల్ పోలీసు స్టేషన్ సీఐ రామకృష్ణారెడ్డి తెలిపారు. రవీంద్రకు 14 రోజుల పాటు కోర్టు రిమాండ్ విధించినట్లు పేర్కొన్నారు. జాకీర్ కొట్టాల సమీపంలో ఓ ఇంటిలోకి బాలికను రవీంద్ర పిలుచుకొని అసభ్యంగా ప్రవర్తించటంలో ఆ బాలిక గట్టిగ అరిచింది. చుట్టు పక్కల వారు పోలీసులకు అప్పగించారు. దీనిపై కేసు నమోదు చేసిన దర్యాప్తు చేసి ఇవాళ రిమాండ్ విధించినట్లు తెలిపారు.

రాయదుర్గం

•రాయదుర్గం •కళ్యాణదుర్గం •ఉరవకొండ

రూ.48 కోట్లతో వంతెన నిర్మాణానికి ఆర్థిక శాఖ ఆమోదం

కణేకల్లు, న్యూస్‌టుడే : కణేకల్లు వద్ద వేదవతి హగరిపై రూ.48 కోట్లతో వంతెన నిర్మాణానికి ఆర్థిక శాఖ ఆమోదం తెలిపినట్లు ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు తెలిపారు. మారెమ్మ ఉత్సవాల్లో పాల్గొనేందుకు మంగళవారం కణేకల్లుకు వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు. గతంలో రూ.40 కోట్లకు అనుమతులు మంజూరు కాగా.. వంతెన పూర్తి చేసేందుకు అదనంగా మరో రూ.8 కోట్లకు అనుమతులు పంపిన ప్రతిపాదనకు ప్రభుత్వం అనుమతులు మంజూరు చేయడంతో నిధులు మంజూరుకు ఆర్థిక శాఖ ఆమోదం తెలిపినట్లు చెప్పారు. కణేకల్లు మండల ప్రజలు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అదనపు నిధులు మంజూరు ప్రత్యేక చొరవ తీసుకుని సాధించినట్లు తెలిపారు. అగ్రిమెంటు పూర్తి కాగానే దసరాకు శంకుస్థాపన చేసే దిశగా కసరత్తు చేస్తున్నట్లు ఎమ్మెల్యే వివరించారు.

అన్న క్యాంటీన్ ప్రారంభం నేడు

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే : కళ్యాణదుర్గం బళ్లారి రోడ్డులో గల ఆర్అండ్‌బీ అతిథి గృహం వద్ద అన్న క్యాంటీన్ ప్రారంభానికి సిద్ధమైంది. ఇక నేటి నుంచి మూడుపూటలా రూ.5 లకే భోజనం అందించి పేదల ఆకలి తీర్చనుంది. దాన్ని బుధవారం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ప్రారంభించనున్నారు. ఇందుకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారు.



సిద్ధమైన అన్న క్యాంటీన్



ఎంపిక ధ్రువపత్రాలు అందుకున్న విద్యార్థులు

పాలిటెక్నిక్ కళాశాలలో ఉద్యోగ మేళా

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే : మండలంలోని బోరంపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడప్, డీఆర్‌డీఏ సంయుక్తంగా మంగళవారం నిర్వహించిన ఉద్యోగమేళాకు స్పందన లభించింది. ఆ సంస్థ జిల్లా అధికారి వెంకట ప్రతాప్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ శ్రీధర్‌కుమార్, అధ్యాపకులు షేక్‌బాషా, సుధాకర్, వివిధ కంపెనీల ప్రతినిధుల ఆధ్వర్యంలో ముఖాముఖి నిర్వహించారు. 104 మంది హాజరు కాగా 42 మంది ఎంపికయ్యారు. వారికి ఆయా కంపెనీలు శిక్షణతోపాటు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తాయి.



వజ్రకరూరు తహసీల్దారు కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మ

భూసమస్యలు త్వరితగతిన పరిష్కరించండి

ఉరవకొండ, వజ్రకరూరు, కూడేరు, న్యూస్‌టుడే : భూసమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని తహసీల్దార్లను జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మ ఆదేశించారు. మంగళవారం ఆయన కూడేరు, ఉరవకొండ, వజ్రకరూరు, తహసీల్దారు కార్యాలయాలను తనిఖీ చేశారు. రికార్డు గదులను పరిశీలించారు. రికార్డులకు సంబంధించి రిజిష్టర్‌లను నిర్వహించాలన్నారు. కార్యాలయాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి వాటిని పర్యవేక్షించాలని ఆదేశించారు. రెవెన్యూ సేవలపై ప్రత్యేక దృష్టి ఉంచాలని సూచించారు.

తాగునీటి సమస్యతో ఇక్కట్లు



విడపనకల్లు మండలం చీకలగురికిలో ట్యాంకు వద్ద బోరు నీటిని పట్టుకుంటున్న స్థానికులు

ఉరవకొండ, న్యూస్‌టుడే : ఉరవకొండ మండలం లత్తవరం, చిన్న ముష్టూరు, బూదగవి, విడపనకల్లు మండలం ఉండబండ, పాల్తూరు, చీకలగురికి, హావళిగి, కూడేరు మండలం ముద్దలాపురం తదితర గ్రామాల్లో గత 20 రోజులుగా కుళాయిలకు సరిగా తాగునీరు సరఫరా కాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికుల సమ్మె కారణంతో నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడింది. ఒక వేళ నీరు వచ్చినా, కొద్ది సేపు కూడా రాకపోవడంతో నీరు దొరకడం కష్టంగా మారింది. స్థానికంగా గ్రామాల్లో ప్రత్యామ్నాయ అవకాశాలు లేకపోవడంతో వారు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం. విడనకల్లు మండలంలో పలు గ్రామాల్లో చాలా మంది వాహనాల్లో పొలాల నుంచి డ్రమ్ములు, బిందెల్లో నీటిని తెచ్చుకుంటున్నారు. దూరం నుంచి నీటిని తెచ్చుకోవడానికి పనులు వదులుకోవాల్సి వస్తోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. ఇది పేద, మధ్య తరగతి ప్రజలకు కష్టంగా మారింది. నీటి సరఫరాను మెరుగు పరిచే దిశగా అధికారులు చర్యలు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

రెండ్రోజుల్లో పరిష్కారం

శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికుల సమ్మె కారణంగా నీటి సరఫరాల్లో తరచూ అంతరాయమేర్పడుతోంది. దాని పరిష్కారం దిశగా ఉన్నతాధికారులు కార్మికులతో చర్చిస్తున్నారు. సమస్య రెండు, మూడు రోజుల్లో పరిష్కారమయ్యే అవకాశం ఉంది.
- అంజుమన్ షఫ్రిన్, డీఈ, ఆర్‌డబ్ల్యూఎస్, ఉరవకొండ



ఖాళీ బిందెలతో జాతీయ రహదారిపై బైఠాయించిన ప్రజలు

రోడ్డెక్కిన జనం

ఉరవకొండ, న్యూస్‌టుడే : తాగునీటి సమస్యను తీర్చాలని కోరుతూ ఉరవకొండ మండలం చిన్న ముష్టూరు ప్రజలు మంగళవారం సాయంత్రం జాతీయ రహదారిపై బైఠాయించారు. నెల రోజులుగా సరిగా కుళాయిలకు నీరు రావడం లేదంటూ వారు ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సమస్యను పరిష్కరించే దిశగా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చొరవ చూపడం లేదని మండిపడ్డారు. తాము నీటిని కొని తాగాలంటే చాలా కష్టంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించేంత వరకూ తాము ఆందోళన విరమించేది లేదని భీష్మించారు. దీంతో జాతీయ రహదారిపై వాహన రాకపోకలకు అంతరాయం కలిగింది. తెదేపా నాయకుడు నెట్టెం రాంబాబు తదితరులు ట్రాక్టర్లతో నీటిని సరఫరా చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM to 1 PM)

రాయదుర్గం పట్టణం: 9666888046, కళ్యాణదుర్గం: 9985668661, ఉరవకొండ: 8008573071

సమస్య : వజ్రకరూరు మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయం ఆవరణలో పిచ్చి మొక్కలు మొలిచి పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయి. **- రాజు, సానికుదు**

సమాధానం : పిచ్చి మొక్కలు తొలగించి పరిశుభ్రంగా ఉంచుతాం. **- శ్రీనివాసులు, ఇన్‌ఛార్జి ఎంపీడీఓ**

సమస్య : వజ్రకరూరులోని పామిడి రస్తాలో రహదారిపై నీరు పారడంతో చిత్తడిగా మారుతోంది. నీరు రాకుండా చర్యలు చేపట్టాలి. **- రమేష్, వజ్రకరూరు**

సమాధానం : కుళాయి నీరు వృథాగా పారుతోంది. చర్యలు తీసుకుని శుభ్రంగా ఉంచుతాం. **- మోనాలిసా, సర్పంచి**

తొలగిన అపరిశుభ్రత

ఈనాడు కథనానికి స్పందన

కుందుర్పి, న్యూస్‌టుడే : కుందుర్పిలోని దగ్గుపల్లి దిలోని అంగన్‌వాడీ కేంద్రం చుట్టూ నెలకొన్న అపరిశుభ్రతపై 'కేంద్రం ఇలా.. భద్రత ఎలా..' శీర్షికన 'ఈనాడు'లో చిత్ర కథనం మంగళవారం ప్రచురితమైంది. కుందుర్పి ప్రాజెక్టు సీడీపీఓ వనజాక్షమ్మ స్పందించారు. గ్రామ కార్యదర్శి మహమ్మద్ రఫీ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ లక్ష్మీదేవి పర్యవేక్షణలో సిబ్బంది, అంగన్‌వాడీ కేంద్రం చుట్టూ పెరిగిన పిచ్చిమొక్కలు, ముళ్లకంపలను తొలగించారు. పరిసరాలను శుభ్రం చేసి, కేంద్రాన్ని అందంగా తీర్చిదిద్దారు.

కాలానుగుణ వ్యాధులపై అప్రమత్తత అవసరం

రాయదుర్గం పట్టణం, న్యూస్‌టుడే : కాలానుగుణ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి అజాద్, మలేరియా సబ్ యూనిట్ అధికారి నాగేంద్ర ప్రసాద్ సూచించారు. మంగళవారం పట్టణంలోని రాజీవ్‌గాంధీ కాలనీలో కాలానుగుణ వ్యాధులపై ఆశా, ఆరోగ్య కార్యకర్తలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీలో ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకురాలు లక్ష్మీనరసమ్మ, ఏఎన్ఎంలు సరోజ, విజయ, లక్ష్మి, శోభ, ప్రమీళ అరుణ, అనిత, లలిత, సునీత తదితరులు పాల్గొన్నారు.



రాయదుర్గంలో వైద్య సిబ్బంది అవగాన ర్యాలీ

కంబదూరు : సీజనల్ వ్యాధులపై ప్రజల అప్రమత్తం ఉండేలా తగు జాగ్రత్తలు తీసుకోవడానికి అవగాహన కల్పించాలని వైద్యాధికారిణి ఆసియా సిబ్బందికి సూచించారు. మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమావేశ భవనంలో సిబ్బందికి అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బీటీపీ పనులపై ఎమ్మెల్యేల భేటీ

రాయదుర్గం, న్యూస్‌టుడే: రాయదుర్గం, కళ్యాణదుర్గం నియోజకవర్గాలకు వరప్రదాయిని బీటీపీ ప్రాజెక్టు పనుల ప్రారంభానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును దసరా పండగ తర్వాత కలిసేందుకు ఎమ్మెల్యేలు కాలవ శ్రీనివాసులు, అమిలినేని సురేంద్రబాబులు నిర్ణయించారు. మంగళవారం రాయదుర్గంలో ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ఇంట్లో ఇద్దరూ సమావేశమయ్యారు. బీటీపీకి కృష్ణాజలాల సాధనపై చర్చించారు. బీటీపీకి ముఖ్యమంత్రిని ఆహ్వానించి నిధుల మంజూరుకు కృషి చేసేందుకు నిర్ణయించారు. వైకాపా ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని, తెదేపా హయాంలో కృష్ణాజలాల సాధనకు సంఘటితంగా పనిచేసేలా నిర్ణయించారు.



ఎమ్మెల్యేలు శ్రీనివాసులు, సురేంద్రబాబు

వైభవంగా మారెమ్మ ఉత్సవాలు

కణేకల్లు: కణేకల్లులో మంగళవారం పలుచోట్ల మారెమ్మ, తాయమ్మ ఉత్సవాలు ఘనంగా జరిగాయి. స్థానిక దిగువగేరి మారెమ్మ, తాయమ్మ, ఆసుపత్రి వెనక మారెమ్మ, అశోక్‌నగర్ మారెమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గంగాజల ఊరేగింపు అనంతరం అమ్మవారికి అభిషేకం, అలంకరణ, ఆకుపూజ, కుంకుమార్చన వంటి సేవలు నిర్వహించారు. ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు తెదేపా నాయకులతో కలిసి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పాడిపరిశ్రమ అభివృద్ధికి ప్రాధాన్యం

ఉరవకొండ : పాడిపరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని పశుసంవర్ధక శాఖ జేడీ డాక్టర్ వెంకటస్వామి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక లయన్స్ క్లబ్‌లో ఉరవకొండ డివిజన్ స్థాయి సమీక్ష సమావేశం డీడీ డాక్టర్ వెంకటేశ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 10 నుంచి జీవాల్లో నట్టల నివారణకు మందులను విస్తృతంగా పంపిణీ చేయాలని ఆదేశించారు. గోకులాల నిర్మాణాలను వేగవంతం చేయాలని చెప్పారు. పశువుల బీమా పథకం ప్రయోజనాలను రైతులకు వివరించాలన్నారు. కార్యక్రమంలో ఏడీలు ఉమామహేశ్వర, నాగలింగారెడ్డి, శ్రీనివాసగుప్తా పాల్గొన్నారు.

కందిపప్పు సరఫరాపై ఆందోళన

రాయదుర్గం : పట్టణంలోని 30వ వార్డులో 9వ చౌక దుకాణం డీలర్ కందిపప్పును మాయం చేసేందుకు యత్నిస్తున్నారని తెదేపా నాయకులు శంకర్, తిప్పేస్వామి, వెంకటేశులు మంగళవారం ఆందోళన చేశారు. కొంతమందికి మాత్రమే కందిపప్పును పంపిణీ చేస్తున్నారన్నారు. కార్డుదారులందరికీ సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై డీలర్ ఉమాపతిని అడుగగా కందిపప్పు స్టాక్ వచ్చిన తర్వాత పంపిణీ చేద్దామని నిర్ణయించగా తెదేపా నాయకులు గొడవ చేయడంతో సరఫరా చేసినట్లు తెలిపారు.

ఉద్యాన నిర్మాణం.. ఎన్నటికి కార్యరూపం?

కళ్యాణదుర్గం గ్రామీణం, కళ్యాణదుర్గం, న్యూస్‌టుడే : కళ్యాణదుర్గంలోని 19వ వార్డులో ఉన్న రాచప్పకుంట స్థలంలో చిన్న పిల్లల పార్క్ (ఉద్యాన వనం) ఏర్పాటు చేస్తామని గతంలో మున్సిపల్ అధికారులు చేసిన ప్రకటన కార్యరూపం దాల్చలేదు. ఫలితంగా ఆహ్లాదకర వాతావరణంలో సేదతీరేందుకు పెద్దలకు వసతిలేదు. పిల్లలు ఆటలాడేందుకు వసతి లేదు. రాచప్పకుంట స్థలం విలువైనది కావడంతో గత వైకాపా హయాంలో కొందరు నాయకులు కబ్జా చేసేందుకు యత్నించారు. ఈ క్రమంలో ఆ స్థలంలో సచివాలయం నిర్మించాలని మొదట నిర్ణయించినప్పటికీ అది జరగలేదు. తరువాత ఆ స్థలంలో డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయాలని రూ.50 లక్షలు నిధులు మంజూరుకు ప్రతిపాదనలు పంపారు. అక్కడ పనులు చేపట్టగానే నివాసాల చెంతనే డంపింగ్ యార్డ్ వద్దంటూ ప్రజలు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఏర్పాటును అడ్డుకున్నారు. చివరకు పిల్లల పార్క్ (ఉద్యానవనం) ఏర్పాటు చేస్తామని ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు ప్రకటించారు. తరువాత చర్యలు తీసుకోలేదు. ప్రస్తుతం ఆ ప్రాంతం మొత్తం పిచ్చిమొక్కలు పెరిగి చిట్టడివిని తలపిస్తోంది. ఆ స్థలం విష కీటకాలకు స్థావరంగా మారింది. దీంతో స్థానికులకు విషపురుగులతో ప్రమాదం పొంచి ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పడటంతో ఉద్యానవనం ఏర్పాటుపై ప్రజల్లో ఆశలు చిగురించాయి. ఎమ్మెల్యే సరేంద్రబాబు స్పందించి రాచప్పకుంట స్థలంలో పార్క్ ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. దీనిపై మున్సిపల్ కమిషర్ వంశీకృష్ణ భార్గవ్‌ను వివరణ కోరగా తాను కొత్తగా వచ్చానని గతంలో ఏం జరిగిందో తనకు తెలియదన్నారు. స్థలం పరిశీలించి ఎమ్మెల్యే, పాలకవర్గ సభ్యులతో చర్చించి చర్యలు తీసుకుంటామని చెప్పారు.



పార్క్ స్థలంలో పిచ్చిమొక్కలు




కళ్యాణదుర్గంలో గరుడవాహనంపై వేంకటేశ్వరుడు



ఉరవకొండ: గజలక్ష్మిగా ఉద్భవలక్ష్మి



రాయదుర్గం: సంతాన లక్ష్మిగా వాసవీమాత



రాయదుర్గం: ధనలక్ష్మిగా శ్రీచౌడేశ్వరీదేవి



కళ్యాణదుర్గం గ్రామీణం: శారదామాత



బొమ్మనహాళ్ : కొలగానహళ్లిలో గ్రామ దేవత



కళ్యాణదుర్గం గ్రామీణం : సంతానలక్ష్మిగా



కణేకల్లు : అష్ట లక్ష్మిగా వాసవీ మాత

అమ్మ అలంకారం.. దేదీప్యమానం

దసరా శరవన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లోని అన్ని ప్రాంతాల్లో మంగళవారం అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. ప్రధాన ఆలయాలన్నీ విద్యుత్తు దీపకాంతులతో అలరారాయి. భక్తులు విశేషంగా తరలివచ్చి అమ్మవార్లను దర్శించుకున్నారు. **-న్యూస్‌టుడే బృందం**



విడపనకల్లు: కొట్టాలపల్లిలో అలంకరణలో చౌడేశ్వరీ దేవి

భూ కబ్జాలపై చర్యలు తీసుకోండి

బొమ్మనహాళ్ : మండలంలోని దేవాదాయ శాఖకు సంబంధించిన భూములు కబ్జాకు గురవుతున్నాయని, వెంటనే విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సీపీఐ నియోజకవర్గం నాయకులు నాగార్జున, కొట్రేష్ డిమాండ్ చేశారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళనకు చేసి.. అనంతరం తహసీల్దారుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు దుర్గన్న, నరశిహ్మలు తిప్పేస్వామి, కొట్రేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలం కాపాడాలని వినతి

రాయదుర్గం : పట్టణంలోని బళ్లారి రోడ్డులోని వైఎస్ విగ్రహం వెనుక ఉన్న రూ.కోట్లు విలువ చేసే పదిసెంట్ల స్థలాన్ని రక్షించాలని పట్టణ తెదేపా బీసీ సెల్ అధ్యక్షుడు బూదూరు తిప్పేస్వామి, నాయకులు రాజశేఖర్, ఎల్లప్ప, ఆనంద్, శంకరప్ప, వెంకటేశులు, మంజునాథ, గంగప్ప తదితరులు తహసీల్దార్ నాగరాజుకు మంగళవారం వినతిపత్రం అందజేశారు.

మద్యం మత్తులో ఆత్మహత్య

కంబదూరు, న్యూస్‌టుడే : మండలంలోని ములకనూరుకు చెందిన రామాంజనేయులు (40) మద్యం మత్తులో గ్రామ శివారులో చింత చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళవారం చోటు చేసుకుంది. అతను కొన్నేళ్లుగా మద్యానికి బానిసయ్యాడు. కుటుంబీకుల సమాచారం మేరకు ఎస్ఐ ఆంజనేయులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చిరుత దాడిలో మేక మృతి

శెట్టూరు, న్యూస్‌టుడే : శెట్టూరు మండలం చిన్నంపల్లిలో మంగళవారం చిరుతదాడిలో రైతు కదరప్పకు చెందిన మేక మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. గ్రామ సమీపంలో గువ్వలబండ కొండప్రాంతంలో మేకలు మేస్తుండగా ఒక్కసారిగా చిరుత దాడి చేసినట్లు బాధిత రైతు వాపోయారు. వెంటనే మేకల కాపర్లు, రైతులు కేకలు వేయగా చిరుత వెళ్లిపోయిందని తెలిపారు. ఎఫ్‌బీఓ తిమ్మక్క 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ చిరుతదాడిలో మేక చనిపోయిందని, బాధిత రైతుకు పరిహారం అందివ్వనున్నట్లు తెలిపారు.

బొలెరో బోల్తా : తప్పిన ప్రమాదం

విడపనకల్లు (ఉరవకొండ), న్యూస్‌టుడే : అరటి పండ్ల లోడ్‌తో కడప జిల్లా పులివెందుల నుంచి బళ్లారి దిశగా వెళ్తున్న బొలెరో మంగళవారం రాత్రి విడపనకల్లు మండలం మాళాపురం గ్రామం వద్ద బోల్తా పడింది. వాహనం టైర్లు పగిలి పోవడంతో, అదుపు అది బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఏమీ కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాద ఘటనపై పోలీసులు ఆరా తీశారు.

క్రైం కార్నర్

అపిలేపల్లిలో నాకాబందీ

కుందుర్పి : మండలంలోని అపిలేపల్లిలో మంగళవారం ఏఎస్ఐ విజయ్‌కుమార్, పోలీసులు నాకాబంధీ నిర్వహించారు. గ్రామంలో అనుమానితుల ఇళ్లల్లో సోదాలు చేశారు. పలువురు ఇళ్లల్లో కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకుని అదుపులోకి తీసుకున్నారు. ఇద్దరు ఇళ్లల్లో మట్కాకు సంబంధించిన చిట్టీలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసులు నమోదు చేశారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

కంబదూరు : గుద్దెళ్లలో మంగళవారం పోలీసులు తనిఖీలు నిర్వహించి ఓ ఇంట్లో 85 కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ ఆంజనేయులు చెప్పారు.

9 మంది బైండోవర్

శెట్టూరు : కర్ణాటక మద్యం అమ్ముతున్న ఎనిమిది మంది, ఒక మట్కా బీటరును మంగళవారం బైండోవర్ చేసి తహసీల్దారు ముందు హాజరుపరిచినట్లు ఎస్‌హెచ్‌ఓ ఎర్రిస్వామి తెలిపారు.

దుకాణంలో చోరీ

ఉరవకొండ, న్యూస్‌టుడే : పట్టణంలోని జాతీయ రహదారిలో రాయంపల్లి దారి సమీపాన మహబూబ్‌బాషాకు చెందిన దుకాణంలో చోరీ జరిగింది. సోమవారం రాత్రి పొద్దుపోయిన తరువాత దొంగలు దుకాణం షట్టర్‌ను ధ్వంసం చేసి, లోపలికి వెళ్లారు. అయితే దుకాణం మూసేటప్పుడు విలువైన వస్తువులను యజమాని ఇంటికి తీసుకెళ్లారు. ఉదయం వచ్చి గమనించగా అప్పటికే దుకాణ ద్వారం తెరిచి ఉంది. బాధితుడు పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు వివరాలు సేకరించారు.

ద్విచక్ర వాహనం అపహరణ

వజ్రకరూరు, న్యూస్‌టుడే : మండలంలోని చాబాలలో ఈ నెల 1న ద్విచక్రవాహనం చోరీకి గురైనట్లు బాధితుడు లక్ష్మన్న మంగళవారం వజ్రకరూరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తన ఇంటి ముందు రాత్రి ఉంచిన ద్విచక్ర వాహనం ఉదయం చూసేసరికి లేదని వారం రోజులుగా వెతికినా దొరకలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

దెబ్బతిన్న పంటల పరిశీలన

బొమ్మనహాళ్, న్యూస్‌టుడే : ఇటీవల బొమ్మనహాళ్ మండలంలో కురిసిన కుండపోత వర్షానికి దెబ్బతిన్న పంటలను జిలా వ్యవసాయ శాఖాధికారి ఉమామహేశ్వరమ్మ, ఏడీఏ లక్ష్మానాయక్, ఏఓ సాయికుమార్ పరిశీలించారు. ఉద్దేహాళ్, బొమ్మనహాళ్, శిద్దరాంపురం, గ్రామాల్లో పర్యటించి పంట నష్టంపై వారు అంచనా వేశారు. మండలంలో 1,400 ఎకరాల్లో భారీ వర్షానికి దెబ్బతిన్నట్లు ప్రాథమికంగా అంచనా వేసినట్లు ఏఓ సాయకుమార్ ఉన్నతాధికారులకు వివరించారు. 100 ఎకరాల్లో వరి, 200 ఎకరాల్లో మొక్కజొన్న, 50 ఎకరాల్లో పత్తి, 103 ఎకరాల్లో మిరప పంట దెబ్బతిన్నట్లు తెలిపారు. అనంతరం రైతులతో మాట్లాడి వివరాలు సేకరించారు. అనంతరం రైతు సేవా కేంద్రం సిబ్బందికి తగిన సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో రాయదుర్గం ఏడీఏ లక్ష్మానాయక్, ఏఓ సాయికుమార్, ఈఏఈఓ, రైతుసేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.



వర్షాలకు దెబ్బతిన్న మొక్క జొన్న పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ శాఖాధికారి ఉమామహేశ్వరమ్మ



నిర్మాణం పూర్తి కాకుండానే రోడ్డు శిథిలం

విడపనకల్లు మండలం పాల్తూరు నుంచి కరకముక్కల దిశగా రెండు కిలో మీటర్ల రహదారిని ఆధునికీకరించే పనులను రెండేళ్ల కిందట రూ.కోటితో చేపట్టారు. రోడ్డున తవ్వి కంకర పరిచారు. ఆ తరువాత పనులు ముందుకు సాగలేదు. ఫలితంగా ఆయా గ్రామాల ప్రజలు, రైతులు ఆ కంకర దారిలో రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులు నిర్మాణం గురించి పట్టించుకోకపోవడంతో రోడ్డు ఎక్కడికక్కడ శిథిలమైంది. సమస్యను పీఆర్ ఏఈఈ లక్ష్మీనారాయణ దృష్టికి తీసుకెళ్లగా రహదారిని పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. *– న్యూస్‌టుడే, విడపనకల్లు (ఉరవకొండ)*

వంట గదుల్లేక అవస్థ

కణేకల్లు : మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో వంట గదులు సమకూరక మధ్యాహ్న భోజన తయారీకి ఏజెన్సీ నిర్వాహకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆరుబయట మధ్యాహ్నం భోజనం తయారు చేస్తున్నారు. గాలికి వచ్చే దుమ్మధూళి వల్ల ఆహారం కలుషితం కావడం, విష పురుగుల బెడద ప్రమాదం పొంచి ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత వైకాపా ప్రభుత్వం హయాంలో ప్రభుత్వ పాఠశాలల్లో నాడు - నేడు కింద పనులు చేపట్టినా.. వంట గదులు నిర్మాణానికి నిధులు మంజూరు కాలేదు. దీంతో స్థానిక బాలుర, ఆదర్శ, మాల్యాం, గరుడచేడు, హులికెర, హనకనహాళ్, యర్రగుంట ఉన్నత పాఠశాలలు గంగలాపురం, కొత్తపల్లి ప్రాథమికోన్నత, బ్రహ్మసముద్రం ప్రాథమిక పాఠశాలల్లో ఆరుబయటే వంట చేస్తున్నారు. బెణికల్లు ప్రాథమికలో తరగతి గదుల పక్కన వరండాలో, 43 ఉడేగోళంలో తడికెలతో ఏర్పాటు చేసుకొన్న షెడ్డులో వంట తయారీకి అవస్థలు పడుతున్నారు. ఈ విషయాన్ని ఎంఈఓ భవనీ శంకర్-2 దృష్టికి తీసుకెళ్లగా నిధుల మంజూరుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. నిధులు రాగానే పనులు చేపడతామని చెప్పారు.



ఆరుబయట మధ్యాహ్న భోజనం తయారీ

మూలకు చేరిన ఈ-ఆటోలు

ఉరవకొండ గ్రామ పంచాయతీకి రెండేళ్ల కిందట మంజూరైన ఈ-ఆటోలు వినియోగించకుండానే మూలకు చేరాయి. వాటి ద్వారా చెత్తను సేకరించాలన్నది లక్ష్యం. అవి విద్యుత్తు ఛార్జింగ్ ఆధారంగా నడుస్తాయి. దీని వల్ల వాటిని సులభంగా వినియోగించి, ఖర్చును తగ్గించుకోవచ్చన్నది ఉద్దేశం. ఇక్కడికి ఐదు ఆటోలు మంజూరు కాగా, ఒక్క దాన్ని కూడా అధికారులు వినియోగించలేదు. అవి తుప్పు పట్టి పాడవుతున్నా పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదు. ఈ విషయాన్ని పంచాయతీ కార్యదర్శి గౌస్‌సాహెబ్ దృష్టికి తీసుకు పోగా, వాటికి మరమ్మతులు చేయించి, వినియోగంలోకి తెస్తామన్నారు. *– న్యూస్‌టుడే, ఉరవకొండ*



బదిలీ ఉద్యోగులకు సత్కారం

బ్రహ్మసముద్రం : స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ దసానాయక్‌తో పాటు ఉద్యోగులు వివిధ ప్రాంతాలకు బదిలీ కావడంతో మంగళవారం ప్రజా ప్రతినిధులు, సిబ్బంది వారికి శాలువా, పూలమాలలతో సన్మానించారు. వారు విధి నిర్వహణలో ప్రజలకు చేసిన సేవలను ఈ సందర్భంగా అందరూ గుర్తు చేశారు.

కణేకల్లు : స్థానిక తహసీల్దారు కార్యాలయంలో విధులు నిర్వహిస్తూ. . వేరే ప్రాంతాలకు బదిలీ అయిన రెవెన్యూ అధికారులకు మంగళవారం ఘనంగా సన్మానించారు. డీటీ రఘురామిరెడ్డి, మండల సర్వేయరు రామ్మోహన్, సీనియర్ సహాయకులు గోవిందరెడ్డి, వీఆర్వోలు రమేశ్, రామోదర్ నాయుడు, ప్రభాకర్, రఘునాథ, ప్రదీప్‌లను శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. తహసీల్దారు ఫణికుమార్, ఉద్యోగులు పాల్గొన్నారు. కణేకల్లు నూతన వీఆర్వోగా పవన్ కుమార్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

కళ్యాణదుర్గం గ్రామీణం : ప్రస్తుతం కంది పంట పూత దశలో ఉందని, సస్యరక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడి పొందొచ్చని వ్యవసాయాధికారి జగదీశ్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని ముద్దినాయనపల్లి, వర్లి గ్రామాల్లో ఆయన ఉద్యాన అధికారి కృష్ణతేజ, పట్టుపరిశ్రమ శాఖ అధికారి ఫిరోజ్‌ఖాన్‌తో కలిసి పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఎంఐఏఓ మల్లేశ్, ఏఈఓ దిలీప్, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

గుంతకల్లు

•గుంతకల్లు •శింగనమల •తాడిపత్రి



రైల్వే డీజిల్‌షెడ్డులో పర్యటిస్తున్న మజ్దూర్ యూనియన్ డీఎస్ విజయకుమార్

కార్మికుల సమస్యలపై ఆరా

గుత్తి, న్యూస్‌టుడే: క్షేత్ర స్థాయిలో రైల్వే ఉద్యోగులు, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకునేందుకు మంగళవారం మజ్దూర్ యూనియన్ డివిజనల్ కార్యదర్శి విజయకుమార్ పర్యటించారు. షెడ్డులోని అన్ని విభాగాలకు వెళ్లి ఆయన ప్రతి కార్మికుడితో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బుకింగ్ డిపో, రైల్వేస్టేషన్లలో కలియ తిరిగారు. స్థానిక నాయకులు నారాయణ, రామాంజులురెడ్డి పాల్గొన్నారు.

మిత్రుడి కుటుంబానికి సాయం

గార్లదిన్నె గ్రామీణం, న్యూస్‌టుడే: పాఠశాలలో 2005-06లో పదోతరగతి చదువుకున్న మిత్ర బృందంలో ప్రస్తుతం ఒక మిత్రుడు కష్టాల్లో ఉన్నాడని తెలుసుకుని తోటి మిత్రులు ఆ కుటుంబానికి తమ వంతు సాయం అందించారు. కల్లూరు గ్రామానికి సురేంద్ర కుమారుడు తలసేమియాతో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. మిత్రులు మంగళవారం రూ.37వేలు ఆర్థిక సాయం కుటుంబ సభ్యులకు అందజేసి భరోసా ఇచ్చారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న మిత్రులు

అవీ.. ఇవీ.. అన్నీ..

ప్రజా సమస్యలపై చొరవ చూపాలి

పుట్లూరు, న్యూస్‌టుడే: పలు గ్రామాల్లో దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ప్రజా సమస్యలపై అధికారులు చొరవ చూపాలని ఎంపీడీవో అలివేలమ్మ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సమస్యలపై అధికారులను ప్రజాప్రతినిధులు ప్రశ్నించారు. జలజీవన్ కార్యక్రమంలో పలు గ్రామాల్లో నీటి సరఫరా ఆగిపోయాయని సభ్యులు తెలిపారు. అధికారులు తమ శాఖల వారీగా సమస్యలపై స్పందించాలని ఎంపీడీవో అలివేలమ్మ తెలిపారు. ఎంపీపీ భూమిరెడ్డి రామచంద్రారెడ్డితో పాటు ఈఓఆర్డీ జిలానీబాషా, ఉపతహసీల్దారు మల్లేశ్‌ప్రసాద్ పాల్గొన్నారు.

రథాల పరిరక్షణకు చర్యలు

గుత్తి, న్యూస్‌టుడే: గుత్తికోటపాడు చుట్టు పక్కల పల్లెల్లోని ఆలయాల వద్ద ఉన్న రథాల పరిరక్షణకు చర్యలు తీసుకుంటామని సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఆలయాల వద్ద ఉంచే రథాలను పరిరక్షించేందుకు నిఘా కెమెరాలను ఏర్పాటు చేయాలని ఆలయ కమిటీల పెద్దలకు సూచించుకున్నారు. మంగళవారం ఆయన తన ఛాంబర్‌లో ఆలయ కమిటీల ప్రతినిధులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో గుత్తి, గుత్తి ఆర్.ఎస్, చెర్లోపల్లి, బసినేపల్లి, తొండపాడు, జక్కలచెరువు తదితర గ్రామాలకు చెందిన ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలు తప్పనిసరి

నార్పల, న్యూస్‌టుడే: భూసార పరీక్షల ఆధారంగా పంటలు సాగుచేసినప్పుడే రైతులు అధిక దిగుబడులు పొందవచ్చని ఆత్మా పీడీ మద్దిలేటి తెలిపారు. మంగళవారం 'హెచ్. సోదనపల్లి' గ్రామంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. రైతులు సాగుచేసిన వేరుసెనగ, కంది, ఆముదం పంటలను పరిశీలించారు. ఏవో చన్నవీరస్వామి, రైతు శిక్షణ కేంద్రం సంచాలకులు తెలజాకుమారి, చంగలరాయుడు, పాల్గొన్నారు.

వృత్తి విద్య కోర్సులతో ఉపాధి

పామిడి, న్యూస్‌టుడే: వృత్తి విద్య కోర్సులతో విద్యార్థులు స్వయం ఉపాధి పొందవచ్చని ఏపీ ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ అరుణ పేర్కొన్నారు. వృత్తి విద్య కోర్సు చేస్తున్న పాఠశాల విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌ను ఈ నెల 2వ తేదీ నుంచి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఫుడ్ ప్రాసెసింగ్ కోర్సులో భాగంగా విద్యార్థులు స్థానిక బేకరీలో తయారు చేసే పదార్థాలపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. వృత్తి విద్యా శిక్షకులు రాఘవేంద్ర, విద్యార్థులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలపై దృష్టి

యల్లనూరు, న్యూస్‌టుడే: శాంతి భద్రతలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని నూతన సీఐ సత్యబాబు పేర్కొన్నారు. మంగళవారం ఆయన ఎస్పీ ఆదేశాలతో మట్కా నిర్వాహకులపై దాడులు చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మట్కా, జూద కేంద్రాలపై జరిపిన దాడులలో తిమ్మంపల్లె గ్రామానికి చెందిన నలుగురు మట్కా నిర్వాహకులను అరెస్టు చేసి, వారి వద్ద నుండి రూ.6 వేలు స్వాధీనం చేసుకున్నామన్నారు. పాత మట్కా నిర్వాహకులను అరెస్టు చేసి తహసీల్దార్ వద్ద బైండోవర్ చేశామని ఎస్ఐ రాంప్రసాద్ తెలిపారు.

మట్కా నిర్వాహకుల అరెస్ట్

గుత్తి, న్యూస్‌టుడే: గుత్తిలోని ఫుట్‌బాల్ క్రీడామైదానంలో మట్కా నిర్వహిస్తున్న వారిపై మంగళవారం పోలీసులు దాడులు నిర్వహించారు. ఐదుగురిని అరెస్టు చేసి రూ.43,250 నగదును సీజ్‌చేసినట్లు సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

గార్లదిన్నె: గార్లదిన్నెలో మట్కా రాస్తున్న అబ్దుల్లా అనే వ్యక్తిని మంగళవారం రాత్రి అరెస్టు చేసినట్లు ఎస్.ఐ గౌస్‌బాషా తెలిపారు. స్థానిక బస్టాండ్ ఆవరణలో మట్కా రాస్తుండగా అతని వద్ద ఉన్న చీటీలతో పాటు రూ.10 వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు.

పెద్దపప్పూరు: వరదాయపల్లిలో పోలీసులు మంగళవారం దాడులు చేసి, మట్కా నిర్వహిస్తున్న శ్రీరాములు, లక్ష్మీనారాయణ నుంచి మట్కా చీటీలతో పాటు రూ. 5020 నగదును స్వాధీనం చేసుకున్నామని ఎస్సై గౌస్‌బాషా తెలిపారు.

తప్పిపోయిన ఇద్దరి అప్పగింత

గుంతకల్లు, న్యూస్‌టుడే: రైలులో ప్రయాణిస్తూ తప్పిపోయిన యువతితో పాటు ఆమె స్నేహితురాలిని మంగళవారం రైల్వే రక్షణదళం పోలీసులు హైదరాబాదుకు చెందిన పోలీసులకు అప్పగించారు. హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి కుమార్తె (18)తో పాటు ఈమె స్నేహితుడు భార్గవ్ 4న రైలులో ప్రయాణిస్తూ తప్పిపోయారు. యువతి తల్లిదండ్రులు హైదరాబాద్‌లోని దుండుగుల్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు గుంతకల్లు రైల్వే రక్షణ దళం అధికారులకు తెలియజేశారు. యువతి, ఈమె స్నేహితుడు రైలులో వచ్చి గుంతకల్లు రైల్వే జంక్షన్‌లోని 7వ నంబరు ప్లాట్‌ఫాంలో ఉన్నట్లు తెలుసుకుని ఆర్పీఎఫ్ ఏఎస్ఐలు సాయికుమారి, రవిశంకర్, సిబ్బంది వారిని కలిసి దుండుగల్ పోలీసులకు సమాచారం అందించారు. ఇరువురిని యువతి తండ్రి, దుండుగల్ పోలీసులకు అప్పగించామని ఆర్పీఎఫ్ సీఐ వసంతరావ్ తెలిపారు.

పేరుకే పురపాలకం

> కాలనీల్లో మట్టిదారులే గతి
> రహదారులపైనే మురుగు



హౌసింగ్ బోర్డు కాలనీలో ఓ వీధిలో మట్టిరోడ్డు

గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే:

గుంతకల్లులోని పలు కాలనీల్లో మౌలిక వసతులు లేకపోవడంతో ప్రజలకు తిప్పలు తప్పడం లేదు. ఇంటి పన్నులు చెల్లిస్తున్నా కాలనీలు అభివృద్ధికి నోచుకోవటం లేదు. కొన్ని చోట్ల సీసీరోడ్లు ఉన్నా కాలువలు లేవు. మరికొన్ని చోట్ల మట్టిదారులే ఇప్పటికీ దర్శనమిస్తున్నాయి. గతంలో వేసిన రహదారులన్నీ నామరూపాల్లేకుండా పోయాయి.

ఏ కాలనీకెళ్లినా అంతే

★ ఆదర్శనగర్‌లో కొన్ని చోట్ల సీసీరోడ్లు లేవు. మట్టిరోడ్లే కనిపిస్తున్నాయి. అవి కూడా ఎగుడుదిగుడుగా ఉన్నాయి. రాత్రి సమయంలో వీధి దీపాలు వెలగడం లేదు. ఆదర్శనగర్ నుంచి పాత గుంతకల్లు అంకాలమ్మ గుడి వైపు వెళ్లే మార్గాలు దారుణంగా ఉన్నాయి. మట్టిరోడ్లు కావడంతో వర్షాకాలంలో అడుగు తీసి అడుగు వేయలేని పరిస్థితి ఉంటోంది. హమాలీ కాలనీలోనూ ఇదే పరిస్థితి కొనసాగుతోంది. ★ హౌసింగ్ బోర్డు కాలనీ ఉపరితల ట్యాంకు ప్రాంతంలో గతంలో వేసిన తారురోడ్లు దెబ్బతిని గుంతలు పడ్డాయి. దీనికి తోడు కాలువలు లేవు. ఫలితంగా రహదారులపైనే మురుగు పారుతోంది. ఇక్కడా మట్టి రోడ్లే ఉన్నాయి.

★ ఐదే కాలనీలో ఆర్టీవో కార్యాలయం వెనుక వైపు సీసీ రోడ్లున్నా కాలువలు లేవు. కాలనీవాసులు మురుగు సమస్యతో ఇబ్బంది పడుతున్నారు

పురపాలిక	గుంతకల్లు
కాలనీలు	ఆదర్శ నగర్, హౌసింగ్ బోర్డ్, ఆర్టీఓ కార్యాలయం ప్రాంతం
జనాభా	25 వేలు
ప్రధాన సమస్యలు	సీసీ రోడ్లు, కాలువలు

ప్రతిపాదనలు పంపాం

కాలనీల్లో సమస్యలను గుర్తించాం. సీసీరోడ్లు నిర్మాణాలకు ప్రతిపాదనలు తయారు చేస్తున్నాం. ప్రజలు సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తాం. కాలనీల్లో ఇంకా సమస్యలుంటే దశలవారీగా పరిష్కారానికి కృషి చేస్తాం.

- హరికృష్ణ, ఏఈ, పురపాలక సంఘం

మేమున్నాం.. మీకు తోడుగా

(10 AM to 1 PM)
గుంతకల్లు పట్టణం: 80085 73072
తాడిపత్రి: 79950 67001
శింగనమల: 99897 94244

సమస్య: కల్లుమడిలో కాలువలు శుభ్రం చేయడం లేదు. **- గురుప్రసాద్**
సమస్య: సలకంచెరువు ఎస్సీ కాలనీలో వీధి దీపాలు లేవు. **- బయన్న**
సమాధానం: పైరెండు ప్రాంతాల్లో వీధి దీపాలు ఏర్పాటు చేయిస్తాం. **- నిర్మలకుమారి, ఎమ్పీడీవో** – న్యూస్‌టుడే, శింగనమల
సమస్య: గుంతకల్లులోని శామసన్ పురం కాలనీ నుంచి పాత గుత్తిరోడ్డుకు వెళ్లే దారిలో మురుగు పారుతోంది. **- తిప్పేస్వామి**
సమాధానం: సమస్యను పరిష్కరిస్తాం. **- సుదర్శన, శానిటేషన్ కార్యదర్శి**
– న్యూస్‌టుడే, గుంతకల్లు

స్పందనకు వందనం

గుంతకల్లు, న్యూస్‌టుడే: పురపాలక మంత్రి నారాయణ, ఎమ్మెల్యే జయరాం 'ఈనాడు'లో ఈనెల 6న 'కల్వర్టుకు గండి.. జాగ్రత్త వహించండి' అనే శీర్షికతో వచ్చిన వార్తకు స్పందించారు. మంత్రి, ఎమ్మెల్యే ఆదేశాలతో స్థానిక పురపాలిక అధికారులు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేయించి సమస్యను పరిష్కరించారు.

గతమెంతో ఘనం... నేడు దైన్యం



తాడిపత్రిలో రైల్వేస్టేషన్‌కు వెళ్లే ప్రధాన రహదారిపై నిలిచిన మురుగు

తాడిపత్రి పట్టణం, న్యూస్‌టుడే: తాడిపత్రి పురపాలిక రాష్ట్రంలోనే ఆదర్శ పురపాలికగా ఎన్నో అవార్డుల, రివార్డులు సొంతం చేసుకుంది. స్వచ్ఛతకు మారుపేరుగా నిలిచింది. పట్టణమంటే ఇలా ఉండాలన్న రీతిలో శుభ్రతకు పెద్దపీట వేశారు. గత వైకాపా ప్రభుత్వం ఆపేరును ఐదేళ్లల్లో భ్రష్టుపట్టించింది. గత పరిస్థితి ఇప్పుడు లేదు. పట్టణంలోని ఏ వీధికెళ్లినా మురుగు కూపాలు, చెత్త నిల్వలు దర్శనమిస్తున్నాయి. మ్యాన్‌హోళ్ల నుంచి మురుగు పొంగిపొర్లుతూ రహదారులపై పారుతోంది.

ప్రధాన కాలనీల్లో ఇదీ పరిస్థితి

ప్రధానంగా నందలపాడు, కృష్ణాపురం ఆరు రోడ్లు, అంబేడ్కర్ నగర్, శ్రీరాముల పేట, రైల్వేస్టేషన్‌కు వెళ్లే ప్రధాన రహదారిపై మురుగు నిలుస్తోంది. మురుగునీటి కాలువ అస్తవ్యస్తంగా మారడంతో మురుగు నీరంతా రహదారిపై చేరి దుర్వాసన వెదజల్లుతోంది. ప్రయాణికులు, వాహనదారులు రహదారిపై వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొత్త ప్రభుత్వంపై ప్రజలు ఆశలు పెట్టుకున్నారు. ఈవిషయంపై మున్సిపల్ ఏఈ తేజను వివరణ కోరగా క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని వినతి



ఎమ్మెల్యే జయరాంకు వినతిపత్రాన్ని అందజేస్తున్న సీపీఎం నాయకులు

గుంతకల్లు, న్యూస్‌టుడే: గుంతకల్లులోని నిరుపేదలకు ఇంటి స్థలాలు కేటాయించి ఆదుకోవాలని సీపీఎం నాయకులు అన్నారు. మంగళవారం పేదలతో కలిసి ఆలూరుకు వెళ్లి గుంతకల్లు ఎమ్మెల్యే జయరాంను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. సీఐటీయూ కాలనీలో 20 ఏళ్లుగా నివాసముంటున్న పేదల ఇళ్లకు పట్టాలు ఇవ్వాలని అన్నారు. కసాపురం రోడ్డు పక్కన 398 సర్వేనంబరులో ప్రభుత్వం పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వడానికి గుట్టను చదును చేశారని, ఇంత వరకు స్థలాలను కేటాయించలేదన్నారు. దోనిముక్కల రోడ్డులో గుట్టలను చదును చేసిన స్థలాలను ఇళ్లు లేని వారికి కేటాయించాలని నాయకులు విజ్ఞప్తిచేశారు. ఎమ్మెల్యే నాయకులతో జాబితాలను సిద్ధం చేసుకోవాలన్నారు. సీపీఎం పట్టణ కార్యదర్శి బి. శ్రీనివాసులు, నాయకులు మారుతీప్రసాద్, రమేశ్, చంద్రశేఖర్, బాషా, అబ్దుల్లా పాల్గొన్నారు.

బస్టాండ్‌కు మహర్దశ పట్టేనా?



శిథిలావస్థకు చేరుకున్న కొత్తబస్టాండ్

పామిడి, న్యూస్‌టుడే: వాణిజ్య సముదాయంగా పేరుగాంచిన పామిడిలో కొత్తబస్టాండ్ అభివృద్ధి కలగానే మిగిలిపోతోంది. ఇక్కడ అనంతపురం, కర్నూలు, బెంగుళూరు, గుంతకల్లు, హైదరాబాద్ తదితర ప్రాంతాలకు నిత్యం వందల సంఖ్యలో ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. ఎన్టీఆర్ సర్కిల్, అంబేడ్కర్ సర్కిల్‌లో ప్రధాన రహదారికి ఇరువైపులా ప్రాంతాన్నే బస్టాండ్‌గా పిలుచుకుంటూ ఏళ్లుగా మండల ప్రజలు కాలం వెళ్లదీస్తున్నారు. దీంతో జెండాకట్ట, ఎద్దులపల్లి రోడ్డు ప్రాంతాల వద్ద రోడ్డుపై నిల్చొని బస్సుల కోసం ప్రయాణికులు ఎదురు చూడాల్సిన పరిస్థితి తలెత్తుతోంది.

రాకపోకలకు దూరంగా.. : 1991లో పామిడిలో బస్టాండ్‌ను నిర్మించారు. అప్పట్లో ఈ ప్రాంతం ఊరి చివరన ఉండడంతో ప్రజల రాకపోకలకు నోచుకోలేదు. దశాబ్దాల తరబడి బస్టాండ్ నిరుపయోగంగా మారడంతో శిథిలావస్థకు చేరుకుంది. ప్రస్తుతం బస్టాండ్ ప్రాంగణం వాణిజ్య దుకాణాలకు కేటాయించి లాభాలు ఆర్జిస్తున్నా ఆర్టీసీ అధికారులు బస్టాండ్ అభివృద్ధిని పట్టించుకోలేదు. ప్రస్తుతం రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం బస్టాండ్‌లోని అపరిష్కృత సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి పామిడి బస్టాండ్‌ను పునర్నిర్మాణం చేయిస్తారనే ఆశతో ప్రజలు ఎదురు చూస్తున్నారు.

శక్తి స్వరూపిణి పాహిమాం



గుంతకల్లులోని శాంతినగర్ చాముండేశ్వరి



బుక్కరాయసముద్రంలో పెద్దమ్మతల్లి



గుత్తిలో వారాహి మాత



తాడిపత్రిలో సరస్వతీదేవి



తాడిపత్రి యల్లనూరు రోడ్డులో మహాలక్ష్మి



కల్లూరులో మహాలక్ష్మీదేవి



పామిడిలో లక్ష్మీదేవి అలంకరణలో



యాడికిలో చండికా దేవి



ఓబుళాపురంలో అన్నపూర్ణాదేవి

వైభవంగా దేవీ శరన్నవరాత్రులు

దసరా శరవన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శింగనమల, గుంతకల్లు, తాడిపత్రి నియోజకవర్గాల్లోని అన్ని ప్రాంతాల్లో మంగళవారం అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. ప్రధాన ఆలయాలన్నీ విద్యుత్తు దీపకాంతులతో అలరారాయి. భక్తులు విశేషంగా తరలివచ్చి అమ్మవార్లను దర్శించుకున్నారు. **- న్యూస్‌టుడే బృందం**



పెద్దపప్పూరులో మద్దిలేటమ్మ



పెద్దవడుగూరులో మహాలక్ష్మీదేవి

ఉపాధి హామీ అక్రమాలపై నిగ్గు తేల్చండి



వివరాలు వెల్లడిస్తున్న చెదుళ్ల తెదేపా నాయకులు

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే: చెదుళ్ల గ్రామంలో నాలుగు నెలలుగా ఉపాధి హామీ పనుల్లో జరిగిన అక్రమాలపై విచారణ చేయాలని తెదేపా నాయకులు నారాయణస్వామి, గురప్ప డిమాండు చేశారు. బుక్కరాయసముద్రంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో వారు మాట్లాడుతూ గత నాలుగు నెలలుగా పనులు లేవని గ్రామస్థులకు చెప్పిన క్షేత్రసహాయకుడు శేషానందరెడ్డి పనులు నిర్వహించినట్లు చేసుకుని బిల్లులు డ్రా చేశారన్నారు. అమకు అనుకూలమైన వ్యక్తుల పేర్లను మస్టర్లలో రాసి అక్రమాలకు పాల్పడ్డారన్నారు. ఇప్పటికే కలెక్టర్, డ్వామా పీడీ, ఎంపీడీవోకు ఫిర్యాదు చేశామన్నారు. తెదేపా నాయకులు మల్లికార్జున, సూర్యనారాయణ, తిరుపాలు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

58 క్వింటాళ్ల చౌక బియ్యం స్వాధీనం

యాడికి: అక్రమంగా తరలిస్తున్న చౌక బియ్యాన్ని మంగళవారం యాడికి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సీఐ ఈరన్న తెలిపిన వివరాల మేరకు యాడికిలోని కోన రోడ్డులో వాహనాల తనిఖీ చేస్తుండగా ఆటో, టాటా 407 వాహనాన్ని తనిఖీ చేశారు. అందులో చౌక బియ్యం బస్తాలున్నాయని గుర్తించారు. మొత్తం 49 క్వింటాళ్లతో పాటు, ఉట్టికంటి మహేంద్ర, రొక్కరుకల నారాయణస్వామి, క్రిష్ణకుమార్, గౌరిగాళ్ల రఘురాముడు, సుంకన్నను అరెస్టు చేసి, కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

గార్లదిన్నె: గార్లదిన్నె మండల పరిధిలోని మర్తాడు గ్రామ మలుపు వద్ద తొమ్మిది క్వింటాళ్ల చౌకబియ్యంతోపాటు ఆటోను మంగళవారం స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వాహన డ్రైవర్ దస్తగిరిని విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

గార్లదిన్నె, న్యూస్‌టుడే: మండల పరిధిలోని ఎంపీఆర్‌డ్యామ్ రోడ్డు మర్తాడు మలుపు వద్ద ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను మంగళవారం పట్టుకున్నట్లు ఎస్సై గౌస్‌బాషా తెలిపారు. పెన్నానది నుంచి ఇసుకను ప్రభుత్వ అనుమతులు లేకుండా ట్రాక్టర్లల్లో అక్రమంగా తరలిస్తుండగా వాటిని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యుత్తు నియంత్రికలు ధ్వంసం



దుండగులు ధ్వంసం చేసిన విద్యుత్తు నియంత్రిక

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే: బొమ్మలాటపల్లి గ్రామ శివారులో సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు రెండు విద్యుత్తు నియంత్రికలు ధ్వంసం చేశారు. రైతులు తెలిపిన వివరాల మేరకు గ్రామ శివారులో నార్పల వెళ్లే రహదారి పక్కన ఉన్న రెండు విద్యుత్తు నియంత్రిలు ధ్వంసం చేసి వాటిలోని విలువైన రాగితీగలను ఎత్తుకెళ్లారన్నారు. నియంత్రికలు ధ్వంసం కావడంతో సమీప పొలాల్లో పంటలు సాగుచేస్తున్న రైతుల వ్యవసాయ మోటార్లకు విద్యుత్తు సరఫరా ఆగిపోయింది. తరచూ విద్యుత్తు నియంత్రిలు ధ్వంసమవుతున్నా విద్యుత్తుశాఖ అధికారులు, పోలీసులు దొంగలను పట్టుకోవడంలో విఫలమవుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై విద్యుత్తు శాఖ ఇంజినీరు ప్రతాప్‌ను వివరణ కోరగా నియంత్రికలు చోరీకి గురవకుండా తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

పట్టు జారిందా.. అంతే



పెద్దవడుగూరు మండలంలోని కొండుపల్లి సమీపంలో ఉన్న భూగర్భగనుల నుంచి డోలమైట్‌ను కొందరు ట్రాక్టర్లలో ప్రమాదకరంగా తరలిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. అనుమతులున్న కొందరు గనుల యజమానులు రోజూ ట్రాక్టరుపై పరిమితికి మించి రాయిని రహదారుల్లో తరలించడం వల్ల ఎప్పుడు ఏం ప్రమాదం జరుగుతుందోనని జనం ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. **- న్యూస్‌టుడే, పెద్దవడుగూరు**

మహిళలకు ఉచిత న్యాయ సాయం

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంత మహిళలకు ప్రభుత్వం న్యాయ సేవా ప్రాధికార సంస్థ తరపున ఉచిత న్యాయ సాయం అందిస్తుందని జిల్లా న్యాయ సేవా కార్యదర్శి, సివిల్ జడ్జి శివప్రసాద్ తెలిపారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో మహిళలకు ఉచిత న్యాయ సహాయంపై అవగాహన కల్పించారు. అనంతరం లఘు చిత్రాల ద్వారా మహిళలను చైతన్య పరిచారు. మహిళాశిశు సంక్షేమశాఖ సంచాలకులు శ్రీదేవి, ఎంపీపీ సునీత, ఎంపీడీవో సాల్మన్‌రాజు, ఎంఈవో లింగానాయక్, ఏపీఎం లింగానాయక్ పాల్గొన్నారు.

స్పిన్నింగ్ మిల్లు పరిశీలన



వివరాలు అడిగి తెలుసుకుంటున్న జేసీ శివనారాయణ శర్మ

గుంతకల్లు గ్రామీణం: గుంతకల్లులోని ఆంధ్ర కో-ఆపరేటివ్ స్పిన్నింగ్ మిల్లును జిల్లా జేసీ శివనారాయణ శర్మ మంగళవారం పరిశీలించారు. మిల్లు మూతపడడానికి కారణాలను చేనేత జౌళి శాఖ అధికారులు, అక్కడ విధులు నిర్వహిస్తున్న కాపలాదారులను అడిగి తెలుసుకున్నారు. మిల్లు పరిధిలోని స్థలాన్ని పరిశీలించి అనధికారికంగా మిల్లు స్థలంలో ఉన్న వారి వివరాలు ఆరా తీశారు. సంబంధించిన సర్వే నంబర్లు పరిశీలించాలని గుంతకల్లు తహసీల్దారు రామాదేవిని ఆదేశించారు. కాపలదారుల జీతాలు సకాలంలో అందుతున్నాయా లేదా అనే వివరాలు తెలుసుకున్నారు. సకాలంలో జీతాలు వచ్చేలా జేనేత జౌళిశాఖ వారికి మంగళగిరిలోని కమిషనర్ కార్యాలయానికి లేఖ రాయాలన్నారు. దోనిముక్కల సమీపంలో నూతనంగా పవర్ గ్రిడ్ కార్పొరేషన్ సంస్థ ఏర్పాటు కోసం సేకరించిన స్థలాన్ని పరిశీలించి సంస్థ ప్రతినిధుల ఆహ్వానం మేరకు ప్లాంట్‌లో మొక్కలు నాటారు. గుంతకల్లులోని మార్కెట్ యార్డులో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొని రైతులకు అవసరమైన సూచనలు చేశారు. అనంతరం రైతులకు మట్టి నమూనా పత్రాలు అందజేశారు.

ఆటపై పట్టు.. విజయ తీరం చేరేట్టు

హాకీ, వాలీబాల్‌లో రాణిస్తున్న క్రీడాకారులు

గుంతకల్లు, న్యూస్‌టుడే : గుంతకల్లులోని కన్యకాపరమేశ్వరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన క్రీడాకారులు క్రీడాపోటీల్లో రాణిస్తున్నారు. ప్రధానాచార్యుడు డాక్టర్ లక్ష్మయ్య, ఫిజికల్ డైరెక్టరు సురేశ్ క్రీడాకారులకు అవసరమైన శిక్షణ అందిస్తూ విద్యార్థులను ప్రోత్సహిస్తున్నారు.


బరిలో.. దూకుడు



భార్గవి

కళాశాలలో మూడో ఏడాది బీఎస్సీ చదువుతున్న భార్గవి హాకీలో ప్రతిభ చాటుతున్నారు. ఈమె ఎస్‌కే యూనివర్సిటీ అంతర్ కళాశాలల హాకీ పోటీల్లో పాల్గొని అత్యంత ప్రతిభతో రాణించారు. దీనికి సౌత్‌జోన్ (దక్షిణభారత స్థాయి) పోటీలకు ఎంపికయ్యారు. 2024 సంవత్సరం ఫిబ్రవరిలో చెన్నైలోని అంబేడ్కర్ లా యూనివర్సిటీలో జరిగిన పోటీల్లో ఎస్‌కె యూనివర్సిటీ జట్టు తరపున పాల్గొన్నారు. వివిధ వర్సిటీ క్రీడాకారిణులతో పోటీపడి సత్తా చాటారు. భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని మంచి పేరును సంపాదించుకోవాలని ఉందని ఆమె చెబుతున్నారు.

ప్రతిభతో దూసుకెళ్తూ..



కిశోర్ నాయక్

కళాశాలలో మూడో సంవత్సరం బీఏ చదువుతున్న కిశోర్ నాయక్ వాలీబాల్‌లో రాణిస్తున్నారు. రోజూ శిక్షణ పొందుతూ ఎక్కడ పోటీలు జరిగినా అందులో పాల్గొని ప్రతిభ చూపుతున్నారు. గతేడాది గత సంవత్సరం అనంతపురంలో జరిగిన ఎస్‌కే యూనివర్సిటీ అంతర్ కళాశాలల వాలీబాల్ పోటీల్లో కళాశాల తరపున పాలుపంచుకున్నారు. ఇక్కడ జరిగిన పోటీల్లో ప్రత్యర్థి జట్లను ఓడించడంలో ఆయన చొరవ చూపడంతో యూనివర్సిటీ అధికారులు వర్సిటీ తరపున సౌత్‌జోన్ పోటీల్లో పాల్గొనేందుకు అవకాశమిచ్చారు. గతేడాది నవంబరు నెలలో చెన్నైలో జరిగిన సౌత్‌జోన్ పోటీల్లో పాల్గొని ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. అండర్-19 పోటీల్లో రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్నారు. జిల్లా స్థాయి పోటీల్లోనూ రాణించారు.

క్రీడాకారులకు ప్రోత్సాహం

కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు ఏ క్రీడలో ఇష్టముందో తెలుసుకొని అందులో ప్రోత్సహిస్తున్నాం. ఎంతో మంది వివిధ క్రీడా పోటీల్లో పాల్గొని రాణిస్తున్నారు. వారికి అవసరమైన సౌకర్యాలు కల్పిస్తున్నాం. వర్సిటీకి క్రీడాకారులుగౌరవంతోపాటు ఎన్నో బహుమతులు తెచ్చి పెట్టారు.



- డాక్టర్ లక్ష్మయ్య, ప్రధానాచార్యుడు

అనంతపురం

•అనంతపురం •రాప్తాడు

ఉపాధ్యాయులకు 30 శాతం మధ్యంతర భృతి ఇవ్వాలి

అనంతపురం విద్య, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఉపాధ్యాయులకు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా 30 శాతం మధ్యంతరభృతి చెల్లించాలని వైఎస్ఆర్ టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు అశోక్‌కుమార్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. మంగళవారం వైఎస్ఆర్ ఉపాధ్యాయ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2019లో 27 శాతం ఐఆర్ ప్రకటించారు. ప్రస్తుతం అన్ని రకాల వస్తువుల ధరలు పెరిగాయి. ఉపాధ్యాయులు అప్పుల పాలవుతున్నారని, ధరలకు అనుగుణంగా 30 శాతం మధ్యంతర భృతి ఇవ్వాలన్నారు. 12వ పీఆర్సీ కమిషన్ నియమించి ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన బకాయిలు వెంటనే మంజూరు చేయాలన్నారు. వీటిపై సానుకూలమైన త్వరగా నిర్ణయం తీసుకోవాలనారు. లేని పక్షంలో ఉద్యమానికి సిద్ధమవుతామని పేర్కొన్నారు.

వ్యర్థాలు ఇలా.. ప్రవాహం ముందుకెలా?



ఈ చిత్రంలో చెత్త ముసురుకుంటున్న లోది అనుకుంటే పొరపాటే. సాగునీరు అందించే హెచ్చెల్సీ కాలువ. నగరం నుంచి బుక్కరాయసముద్రం వెళ్లే ఈ కాలువలో వ్యర్థాలు చేరి నీటి ప్రవాహానికి అడ్డుగా మారాయి.
- ఈనాడు, అనంతపురం

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM to 1 PM)

అనంత నగరపాలక: 8008573011, రూరల్: 8008573010, రుద్రంపేట: 9989195979, ఎమ్మెల్సీ కాలనీ: 8008573005 రాప్తాడు: 6304766286, ఆత్మకూరు: 7995067003

సమస్య: ఆర్‌ఎన్‌రెడ్డి సమీపంలో మురుగును తొలగించాలి. తరలింపు కుండా అలానే వదిలేశారు. - వేణుగోపాల్

సమాధానం: వెంటనే తరలిస్తాం.- విష్ణుమూర్తి, నగరపాలక ఎంహెచ్ఓ - న్యూస్‌టుడే, అనంతపురం (కమలానగర్)

ప్లాస్టిక్ రహిత గ్రామంగా మారుస్తాం

ఆత్మకూరు, న్యూస్‌టుడే: పవిత్ర పుణ్య క్షేత్రమైన పంపనూరును ప్లాస్టిక్ రహిత గ్రామంగా మారుస్తామని ఎంపీడీవో లక్ష్మీనరసింహ పేర్కొన్నారు. ఎటు చూసినా ప్లాస్టిక్ వస్తువులే అంటూ 'ఈనాడు'లో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. మంగళవారం పేరుకున్న ప్లాస్టిక్ వ్యర్థాలను ఎంపీడీవో, ఎంపీపీ పామలత శుభ్రం చేయించారు. పర్యాటకులకు వీలుగా ఉన్నచోట చెత్త వేస్తే జరిమానా ..



వ్యర్థాల తొలగింపు పనులు పరిశీలిస్తున్న అధికారులు

చెత్త వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హోటల్ నిర్వాహకులకు నోటీసులు జారీ చేశారు. బీ యాటిరు చెరువులో ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. పంచాయతీ కార్యదర్శి శిరీష, సర్పంచి ఎర్రిస్వామి, వీఆర్ఓ ప్రసాద్ పాల్గొన్నారు.

అనంత నగరపాలక	
గృహాలు:	69,357
రోజుకు ఒనకూరే చెత్త:	125 నుంచి 140 మెట్రిక్ టన్నులు
చెత్త వాహనాలు:	60
పన్ను వసూళ్లు:	2021 జులై
ఒక్కో ఆటోకు నెలకు చెల్లించే సొమ్ము:	రూ.60 వేల నుంచి రూ.62 వేల వరకు
పన్ను వసూళ్ల లక్ష్యం:	రూ.4.07 కోట్లు
ప్రజల నుంచి వసూళ్లు చేసింది:	రూ.51,74,296

చిత్తశుద్ధి పెరిగితేనే.. ● చెత్త పన్ను రద్దుతో ఊరట
నగర స్వచ్ఛత సాకారం

అనంత నగరపాలక, న్యూస్‌టుడే: ఎన్నికల్లో ఇచ్చిన హామీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నారు. ఆఖరికి చెత్త మీద కూడా జగన్ పన్ను విధించి ప్రజల నుంచి సొమ్ము రాబట్టుకోవడంతో రెండేళ్లుగా తీవ్ర విమర్శలు ఎదుర్కొన్నారు. ఆ పన్ను రద్దు చేస్తున్నట్లు చంద్రబాబు ఇటీవల ప్రకటించడంతో ప్రజలకు ఊరట లభించింది.



చెత్త సేకరణ

● ఉమ్మడి జిల్లాలోనే ఏకైక నగరం అయిన అనంతపురంలోనే ఎక్కువగా చెత్త పన్ను వసూలు చేశారు. జిల్లా కేంద్రం కావడంతో పాటు 75 సంవత్సరాల క్రితమే పురపాలికగా ఏర్పాటు కావడంతోపాటు 2005లో నగరపాలకగా రూపాంతరం చెందింది. జిల్లా కేంద్రంలో ఎక్కువగా దుకాణాలు, లాడ్జిలు, ఆసుపత్రులు ఇత రత్రాలు అధికంగా ఉన్నాయి. పలు ప్రాంతాల్లో ప్రజల నుంచి నిరసనలు వ్యక్తం కావడంతో పాటు పేదలు చెల్లించలేమని సచివాలయ ఉద్యోగులపై తిరగబడ్డారు. అధికారులు లక్ష్యాలను నిర్దేశించి వార్డు సచివాలయ ఉద్యోగులపై మెడ మీద కత్తి పెట్టి మరీ వసూలు చేశారు. కొన్ని ప్రాంతాల్లో ఉద్యోగులే వారి చేతి నుంచి కట్టిన సందర్భాలు ఉన్నాయి.

● చెత్త పన్ను వసూలు చేయడానికి క్లీన్ ఆంధ్ర ప్రదేశ్ /క్లాప్/ విధానాన్ని తెరపైకి తీసుకొచ్చారు. ఒక్కో ఇంటికి మూడు చెత్త బుట్టలు అందజేసి అందులో తడి, పొడి, హానికర



క్లాప్ ఆటోలు

చెత్తను వేస్తే వాటిని ప్రత్యేకంగా ఆటోలో వేస్తారు. చెత్తను డంపింగ్ యార్డుకు తరలించి వేరు చేయాల్సి ఉంది. ఈ ప్రక్రియ ఎక్కడా సాగిన దాఖలాలు లేవు. చెత్తను తీసుకెళ్లినందుకు నివాసాల నుంచి రూ.60 నుంచి రూ.120, ఇతరత్రాల నుంచి వాటి సముదాయాన్ని బట్టి రూ.500 నుంచి రూ.10వేలు దాకా వసూలు చేశారు. చెత్తను పూర్తి స్థాయిలో సేకరించలేక పోయారు. కూటమి ప్రభుత్వం చెత్త పన్ను రద్దు చేసినా ఆటోల యజమానులు నగరంలో ఇంటింటా చెత్త సేకరణ సాగుతోంది. అధికార యంత్రాంగం పక్కాగా పర్యవేక్షించి ప్రతి ఇంటి నుంచి చెత్తను తరలించినప్పుడే మరింగా ఆశావహ ఫలితాలు అందుతాయి.

కర్ణాటక మద్యం స్వాధీనం

అనంతపురం(కమలానగర్): నగరంలోని బుడ్డప్పనగర్‌లో కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లు విక్రయిస్తున్న శీనా సోమని ఒకటో పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. సీఐ రాజేంద్రనాథ్‌యాదవ్ తెలిపిన వివరాల మేరకు.. బుడ్డప్పనగర్‌లో కర్ణాటక మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం రావటంతో దాడులు నిర్వహించామన్నారు. శీనా సోమ నుంచి 47 టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

రాచపాళెం చంద్రశేఖరరెడ్డికి పురస్కారం

అనంత సాంస్కృతికం: విశ్రాంత ఆచార్యులు రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డికి స్పందన అనంత కవుల వేదిక ఆధ్వర్యంలో జీవన సాఫల్య పురస్కారానికి ఎంపిక చేశామని ప్రధాన కార్యదర్శి చంద్రశేఖరశాస్త్రి తెలిపారు. నగరంలో జరుగనున్న కార్యక్రమంలో పురస్కారం ప్రదానం చేస్తామన్నారు. సర్వదర్శి సాహిత్యం, పాళీ, రెండు ప్రపంచాల వంటి కవితా సంపుటాలను వెలువరించడంతోపాటు విమర్శకులుగా వ్యవహరించడంతో పురస్కారానికి ఎంపిక చేశామని తెలిపారు.



ఓబీఆర్ కాలనీలో కొలువైన అమ్మవారు | పంపనూరు పార్వతీదేవి అమ్మవారు | రాయదుర్గంలో శ్రీ భగవతి అమ్మవారి అలంకరణ | పాతూరు అమ్మవారిశాలలో.. | శివకోటిలో రాజ్యలక్ష్మీదేవి అలంకారంలో.. | ఉమానగర్‌లో వేప ఆకులతో అలంకారం

మహాలక్ష్మీ నమోస్తుతే..

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 6వ రోజు అనంతపురం నగరం, రాప్తాడు నియోజకవర్గాల పరిధిలో పలు ఆలయాల్లో అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. వాసవీమాత ఆలయంలో ఆర్య వైశ్యుల వైదిక్ధాలను సమర్పించారు. - న్యూస్‌టుడే, అనంత సాంస్కృతికం, ఆత్మకూరు, కళ్యాణదుర్గం రోడ్డు, తపోవనం



కొత్తూరు అమ్మవారి శాలలో కంచి కామాక్షిదేవి, వాసవీదేవి, సంతోషీమాత దేవి అలంకారాలలో ఉత్సవ విగ్రహాలు



ఫెర్రర్‌నగర్ శివాలయ యోగి ఆశ్రమంలో.. | రైల్వేఫీడరు రోడ్డులో | వేదగాయత్రి ఆలయంలో.. | మహాలక్ష్మీ దేవి అలంకారంలో అమ్మవారు | సుభాష్‌రోడ్డులో పూలలో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

నాడు.. నేడంటూ రూ.కోట్లు నొక్కేశారు

● ఐదేళ్ల వైకాపా పాలనపై ఎమ్మెల్యే దగ్గుపాటి మండిపాటు

అనంతపురం (కళ్యాణదుర్గంరోడ్డు), న్యూస్‌టుడే: నాడు - నేడంటూ వైకాపా ప్రభుత్వం ఉత్తమాటలు చెప్పి రూ. కోట్లు నొక్కేశారని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పేర్కొన్నారు. 'మీ ఇంటికి - మీ ఎమ్మెల్యే' కార్యక్రమంలో భాగంగా మంగళవారం నగరంలోని 26వ డివిజన్ హౌసింగ్‌బోర్డు, హమాలీ కాలనీల్లో పర్యటించారు. హమాలీ కాలనీలో శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ పాఠశాలను పరిశీలించారు. గత ప్రభుత్వ హయాంలో పాఠశాలలను ఆదర్శంగా తీర్చిదిద్దుతామని చెప్పి కోట్లాది రూపాయలు జేబులు నింపుకొన్నారని మండిపడ్డారు. సమస్యను రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకెళ్లి నూతన భవనాలు నిర్మించేలా చర్యలు తీసుకుంటామన్నారు. అయా కాలనీల్లో మురుగు



కాలువను పరిశీలిస్తున్న దగ్గుపాటి ప్రసాద్

కాలువలు పరిశీలించారు. అధికారులతో ప్రతి ఇంటికి వెళ్లి సమస్యలపై ఆరా తీశారు. ప్రజా పద్దకు పాలన అందించాలనే ధ్యేయంగా ప్రజలను కలుసుకొని సమస్యలు తెలుసుకుంటున్నట్లు వివరించారు. కాలువలు ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని అధికారులను ఆదేశించారు.

'ఎమ్మెల్యేను విమర్శిస్తే సహించం'

అనంతపురం (వ్యవసాయం), న్యూస్‌టుడే: అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌ను విమర్శిస్తే చూస్తూ ఊరుకోమని తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్‌యాదవ్ హెచ్చరించారు. ఎమ్మెల్యేపై నగర మేయర్ వసీం చేసిన వ్యాఖ్యలపై స్పందించారు. మంగళవారం అనంతపురం అర్బన్ తెదేపా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. మేయర్ వసీం వాస్తవాలు ఏంటో ఒకసారి ప్రజల్లోకి వచ్చి తెలుసుకోవాలన్నారు. మీ ప్రభుత్వంలో సమస్యలు పట్టించుకోలేదు. ఎమ్మెల్యే చేస్తుంటే విమర్శించడం తగదన్నారు. మేయర్‌గా ఉంటే హమాలీకాలనీలోని ప్రభుత్వ పాఠశాల వద్దకు రండి, మీరు చేసిన పనులు చూపిస్తామని సవాల్ విసిరారు.

అక్రమంగా దారి ఏర్పాటుపై ఫిర్యాదు

రాప్తాడు, న్యూస్‌టుడే: రాప్తాడు మండలం మరూరు గ్రామ పొలంలో దళితులకు చెందిన పట్టా భూమిలో అక్రమంగా దారి ఏర్పాటు చేస్తున్నారని దళితసంఘం నాయకులు రాప్తాడు ఎమ్మార్వోకు ఫిర్యాదు చేశారు. మరూరు గ్రామ పొలంలో 2014లో తిరుపాల్ కొనుగోలు చేశారు, ఆ భూమిలో మరూరు గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు దౌర్జన్యంగా దారి ఏర్పాటు చేశారన్నారని పేర్కొన్నారు. అన్యాయానికి పరిశీలించి న్యాయం చేయాలని మంగళవారం దళిత సంఘం నాయకులతో కలసి తిరుపాల్ రాప్తాడు ఎమ్మార్వో విజయకుమారికి వినతిపత్రం అందజేశారు.

యుద్ధాల్లో వాయుసేనదే కీలకపాత్ర

తపోవనం (అనంత గ్రామీణం), న్యూస్‌టుడే: శత్రు దేశాలతో జరిగే యుద్ధాల్లో మన దేశాన్ని ముందుకు నడిపించడంలో వాయుసేన పాత్ర కీలకమైనదని జిల్లా మాజీ



అవిర్భావ వేడుకల్లో మాజీ సైనికులు

సైనికుల సంఘం అధ్యక్షుడు కెప్టెన్ డి. షేక్షావలి పేర్కొన్నారు. మంగళవారం ఆ సంఘం కార్యాలయంలో వాయుసేన అవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాకిస్థాన్, బంగ్లాదేశ్‌తో జరిగిన కదనరంగాల్లో మన దేశం విజయబావుటా ఎగురవేయడంలో వాయుసేన కీలక భూమిక పోషించిందని కొనియాడారు. సర్జికల్ స్ట్రైక్ నిర్వహించి వాయుసేన అనేకసార్లు సఫలీకృతమైందన్నారు. అనంతరం వాయుసేనలో పనిచేసి మృతిచెందిన వారికి నివాళులర్పించారు. మాజీ సైనికులు బషీర్ అహ్మద్, రత్నయ్య, అబ్దుల్ వహాబ్, నాగరాజు, సంజీవకుమార్, ఈశ్వరయ్య, హుస్సేన్, పెంచలయ్య, ప్రసాద్, సిద్దన్న, నజీరుసాబ్, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

ఒక్క లైటూ వెలగలేదు!



రాంనగర్‌లో ఉన్న సిద్ధార్థ ఉద్యానవనంలో ప్రారంభించిన కొద్ది రోజులకే లైట్లు నేలమట్టమై చూస్తున్నాయి. ఇటీవల ఉద్యానవనాన్ని ఆధునికీకరించారు. కాలినడక కోసం ఏర్పాటు చేసిన దారికి రెండు వైపులా నేలపై కొద్ది ఎత్తులో లైట్లు వేశారు. ఉదయం, సాయంత్రం వేళల్లో చిన్నారులు, పెద్దలు, మహిళలు ఉద్యానవనంలోకి వచ్చి ట్రాక్ మీద నడిస్తే నేల మీద లైట్లు వెలుతురు పడితే ఆహ్లాదంగా ఉన్నందుకు లైట్లు ఏర్పాటు చేశారు. వైరింగ్ ఏర్పాటు చేయక అవి వెలగడం లేదు. మొదటిలో నడిస్తే తగిలి కింద పడే పరిస్థితి నెలకొంది. వంద లైట్లు వరకు ఏర్పాటు చేసినా ప్రయోజనం లేకుండా పోయింది. - న్యూస్‌టుడే, రాంనగర్ (అనంతనగరపాలక)

నియంత్రికలను కమ్మేస్తాయ్!

విద్యుత్తు నియంత్రిక నిర్వహణపై నిర్లక్ష్యం కొనసాగుతోంది. విద్యుత్తు తీగలు కనపడకుండా అల్లుకుంటున్న తీగల కారణంగా నిత్యం సరఫరాలో అంతరాయం కలుగుతోంది. అయినా పట్టించుకునే నాథుడే లేరు. హౌసింగ్ బోర్డుకాలనీ ఎలీజబ్ బస్సు ఆగే ప్రాంతంలో నియంత్రిక ప్రమాద



కరంగా ఉంది. పూజల సమయ తలెత్తి నిత్యం విద్యుత్తు సరఫరా అంతరాయం ఏర్పడుతున్నట్లు కాలనీవాసులు వాపోతున్నారు. గాలి వీచినప్పుడు నివ్వురవ్వలు వస్తున్నాయని అందోళన వ్యక్తం చేశారు. రెవెన్యూకాలనీలో రెండు స్తంభాల మధ్య తీగలకు మొక్క అల్లుకున్నా సమస్య ఎవరికి పట్టడం లేదు.- న్యూస్‌టుడే, కమలానగర్, ఈనాడు, అనంతపురం

వంతెన నిర్మాణం పూర్తయ్యేనా?

రుద్రంపేట - ఆలమూరు ప్రధాన రహదారిలో రెండు వరుసల వంతెన నిర్మాణ పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఓవైపు వాహన రాకపోకలు సాగుతుంటే, మరోవైపు పనులు పూర్తి చేయకుండా వదిలేయడంతో వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. వంతెన కంకర రాళ్లతో దర్శనమిస్తోంది. ఆర్.బి. శాఖ అనంతపురం డివిజన్ డీఈకు బాలకాసిమయ్యను వివరణ కోరగా.. త్వరలోనే నిర్మాణ పనులు పూర్తి చేసి ప్రారంభిస్తామని తెలిపారు. - న్యూస్‌టుడే, రుద్రంపేట



బోరు వేశారు.. సరఫరా మరిచారు

రుద్రంపేట పంచాయతీ పరిధిలోని చైతన్య కాలనీలో ఎన్నికల ముందు బోరుబావి తవ్వి పైపులైన్ ప్రారంభించారు. ఏడాది గడిచినా విద్యుత్తు సదుపాయం లేకపోవడంతో నీటి సరఫరా జరగలేదని స్థానికులు వాపోయారు. కన్నేళ్లుగా తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీ కార్యదర్శి హరయతుల్లాను వివరణ కోరగా సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. - న్యూస్‌టుడే, రుద్రంపేట



నేడు, రేపు వాతావరణ మార్పులపై కార్యశాల

తపోవనం (అనంత గ్రామీణం), న్యూస్‌టుడే: వాతావరణ ప్రభావం - గ్రామాల్లో మార్పులు, అభివృద్ధి అంశంపై రెండు రోజులపాటు కార్యశాల నిర్వహిస్తున్నట్లు ఎ.ఎఫ్ ఎకాలజీ డైరెక్టర్ వైవీ మల్లారెడ్డి తెలిపారు. బుధ, గురువారాల్లో నిర్వహించే ఈ కార్యక్రమంలో పలువురు శాస్త్రవేత్తలు పాల్గొని ప్రసంగిస్తారు. బెంగళూరు ఐఐఎస్‌సీ విశ్రాంత ఆచార్యుడు రవీంద్రనాథ్, ఐఐ ఎస్సీ ప్రతినిధి బీఎస్. సుష్మ ప్రధాన వక్తలుగా పాల్గొంటారు. కరవు నివారణ పద్ధతులు, జీవనోపాధి ఒడిదొడుకులు, యువత ప్రాధాన్యాంశాలు, ప్రకృతికి నష్టం కలిగించని విధంగా పలు చర్యలు తదితర అంశాలపై నిపుణులు ప్రసంగిస్తారు. సీకే గంగూలీ, డాక్టర్ యలమందారెడ్డి, భక్తర్, విజయ్ శంకర్‌బాబు, డాక్టర్ ఎస్.సుబ్బాశ్రీ, డాక్టర్ దీపక్ లాంటి నిష్ణాతులు వివిధ అంశాలపై అవగాహన కల్పిస్తారు. ఈ కార్యశాలను విజయవంతం చేయాలని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

ముగిసిన శిక్షణ శిబిరం

అనంతపురం క్రీడలు, న్యూస్‌టుడే: పదిరోజులుగా ఆంధ్ర రంజీ జట్టుకు నిర్వహించిన శిక్షణ శిబిరం మంగళవారం ముగిసింది. అనంత క్రికెట్ మైదానంలో నిర్వహించిన ఈ శిక్షణ శిబిరంలో జిల్లా క్రికెటర్లు పాల్గొన్నారు. రంజీ జట్టుకు ఎంపికైన రికీభుయ్, కేఎస్ భరత్, నితీశ్‌కుమార్‌రెడ్డి, హనుమవిహారి, అశ్విన్‌హెబ్బార్ లాంటి క్రికెటర్లు ఈ శిక్షణలో పాల్గొన్నారు. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్, ఫిట్‌నెస్‌పై వివిధ కోణాల్లో తర్ఫీదు ఇచ్చారు. ఈ జట్టుకు త్రిపురతో ఒక సెలెక్షన్ మ్యాచ్ కూడా నిర్వహించారు. ఆంధ్ర క్రికెట్ సంఘం ఆధ్వ



ఆంధ్ర రంజీ జట్టు సభ్యులు

ర్యంలో నిర్వహించిన ఈ శిక్షణ శిబిరంలో అనుభవజ్ఞులైన శిక్షకులు పాల్గొని క్రికెటర్లను తీర్చిదిద్దారు. ముఖ్య శిక్షకుడు టీను యోహానన్ నేతృత్వంలో బ్యాటింగ్ శిక్షకుడు జ్ఞానేశ్వరరావు, సహాయ శిక్షకుడు విక్రమ్‌వర్మ, ఫీల్డింగ్ శిక్షకుడు శివకుమార్‌లు పాల్గొన్నారు. ఈనెల 11 నుంచి నాగ్‌పూర్‌లో జరుగనున్న తొలిమ్యాచ్‌లో విదర్భ జట్టుతో తలపడనుంది.

కబ్జాదారులను అడ్డుకోండి

అనంతపురం (శ్రీనివాసనగర్), న్యూస్‌టుడే: అనంత గ్రామీణ మండలం కక్కలపల్లి పొలం సర్వే నంబరు 30/1లో 5.09 ఎకరాల పట్టా భూమి ఉంది. కొందరు ఆక్రమణదారులు ఆలయం నిర్మిస్తున్నారని, సత్వరమే అడ్డుకోవాలని విద్యాసాగర్ నాయుడు కలెక్టర్ వినోద్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. తమ తాతల కాలం నుంచి వచ్చిన స్థలాన్ని అని, రాజకీయ పలుకుబడితో కొందరు కొంత స్థలాన్ని ఆక్రమించి సామాజిక భవనాన్ని నిర్మించారన్నారు. దీనిపై కోర్టులో వివాదం సాగుతోందన్నారు. ఎలాంటి కట్టడాలు కట్టొద్దని కోర్టు ఆదేశించినా ఆలయం నిర్మిస్తున్నారన్నారు. వెంటనే అడ్డుకోవాలని కలెక్టర్‌ను కోరారు.

కాంగ్రెస్‌తోనే సముచితస్థానం

ఉమానగర్, న్యూస్‌టుడే: కాంగ్రెస్ పార్టీలో అన్నివర్గాలకు సముచితస్థానం దక్కుతుందని ఆ పార్టీ మైనార్టీసెల్ రాష్ట్ర అధ్యక్షుడు దాదాగాంధీ అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మైనార్టీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా రెండోసారి తనను నియమించినందుకు ఏఐసీసీ నేతలు మల్లికార్జునఖర్గే, సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, పీసీసీ అధ్యక్షురాలు షర్మిలకు కృతజ్ఞతలు తెలిపారు. మైనార్టీలు కాంగ్రెస్ పక్షాన నిలవాలని కోరారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

ఆత్మకూరు: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను జప్తు చేసినట్లు ఎస్ఐ లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. బెళుగుప్ప మండలం కాలువపల్లి ప్రాంతం నుంచి ఆత్మకూరు మండలంలోని పంపనూరు పరిసరాల్లో అక్రమంగా ఇసుకను అనంతపురానికి తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో గస్తీ నిర్వహించారు. కాలువపల్లికి చెందిన రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

తెరపై ఈనాడు

కమలానగర్, న్యూస్‌టుడే: గంగ : సత్యం సుందరం, గాయత్రి: రామ్‌నగర్ బన్నీ, గౌతమ్: కలి, మిస్టర్ సెలబ్రిటీ, గౌరి, త్రివేణి, ఎస్వీ సినిమాక్స్, నీలిమ : దేవర, తరంగిణి: దక్షిణ, తేజస్విని : స్వాగ్

పాలస్తీనాపై దాడులు ఆపాలి

ఉమానగర్, న్యూస్‌టుడే: పాలస్తీనాపై సామ్రాజ్యవాద దురాక్రమణలు, దాడులు ఆపాలని ఏఐవైఎఫ్, ఇప్టూ నాయకులు డిమాండ్ చేశారు. సప్తగిరి కూడలిలో సీపీఐ అనుబంధ ఏఐవైఎఫ్, ఇప్టూ, ఏఐఎస్ఎఫ్, ఏఐటీయూసీ సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి సంతోశ్‌కుమార్, ఇప్టూ గౌరవాధ్యక్షుడు అల్లీపీరా మాట్లాడారు. గతేడాది సెప్టెంబరు 7న సామ్రాజ్యవాద దేశాల ప్రోద్బలంతో ఇజ్రాయెల్ దేశం పాలస్తీనాపై దాడులు చేస్తున్నారు. ఈ దాడుల్లో ఎంతో మంది ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఐక్యరాజ్య సమితి నిబంధనలు ఉల్లంఘించి దురాక్రమణలు చేస్తున్నారని విమర్శించారు. శ్రీనివాసులు, నరసింహయాదవ్, చాంద్‌బాషా, బాజాహుసేన్ పాల్గొన్నారు.



నిరసనలో యువజన, ప్రజాసంఘాల నాయకులు

ఆదమరిస్తే అంతే సంగతులు



అశోక్‌నగర్ అంబేడ్కర్ భవన్ వద్ద గుంతలమయం

అనంతపురం(కమలానగర్), న్యూస్‌టుడే : అనంతపురం నగరంలోని ప్రధాన దారుల్లో అడుగుకో గుంత అన్నట్లుగా ఉంది. ఇటీవల కురిసిన వర్షాలకు కొన్ని ప్రాంతాల్లో రోడ్లు దెబ్బతింది, భారీ వాహనాల నగరంలోని రావటంతో పల్ల కొన్ని ప్రాంతాల్లో గుంతలు ఏర్పడ్డాయి. గత వైకాపా ప్రభుత్వంలో నాసిరకం రోడ్ల నిర్మాణాలు ఇప్పుడు గుంతలు పడటానికి కారణమవుతున్నాయని కొంత మంది వాహనదారులు ఆరోపిస్తున్నారు. నగరంలో నిత్యం ప్రధాన దారులు, కూడళ్లలో వేల మంది వాహనదారులు రాకపోకలు సాగిస్తుంటారు. రోడ్డుపై గుంతల కారణంగా నిత్యం వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అశోక్‌నగర్, సప్తగిరి సర్కిల్, ఆర్ట్స్ కళాశాల రోడ్డు, ఎస్వీ ఆర్ సర్కిల్ రోడ్డు, శ్రీకంఠం, నీలం సర్కిల్, పాతూరు, రైల్వే ఫీడర్ రోడ్డు, నాయక్ నగర్, జేఎన్టీయూ రోడ్డు, శారదనగర్ ప్రాంతాల్లోని రోడ్లలో గుంతలు పడ్డాయి. వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రిళ్లు ఈ గుంతల కారణంగా వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు.

● రెండు రోజుల క్రితం కొవూర్‌నగర్‌కు చెందిన నాగరాజు ఫ్యాక్టరీ పని నిమిత్తం కలెక్టర్ కార్యాలయానికి వెళ్తుండగా సూర్యనగర్ సర్కిల్ రోడ్డులో గుంత కారణంగా ద్విచక్ర వాహనం కిందపడి గాయాలయ్యాయి.

● ఆర్ట్స్ కళాశాల వద్ద శ్రీధర్ అనే డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్న యువకుడు సైకిల్‌పై మధ్యాహ్నం ఇంటికి వెళుతున్న సమయంలో కళాశాల నుంచి బయటకు వచ్చి రోడ్డుపై ఉన్న గుంత కారణంగా కిందపడ్డాడు. కాలికి తీవ్రమైన గాయం అయ్యింది. వెనకవైపు భారీ వాహనం లేకపోవటంతో పెద్ద ప్రమాదమే తప్పింది.

పలకలు ధ్వంసం

ఆజాద్‌నగర్ (అనంతపురం): అనంతపురం నగరం హెచ్చెల్సీ కాలువ సమీపాన



గంగానగర్ వద్ద రోడ్డు ప్రమాదకరంగా మారింది. అక్కడ సిమెంట్ రోడ్డు నిర్మించే సమయంలో డ్రైనేజీ కూడా నిర్మించారు. డ్రైనేజీపై ఉన్న సిమెంటు పలకలు పగిలిపోయి, అడుగు అడుగున మేర కాలువ తెరుచుకుంది. మరమ్మతులు చేపట్టక అలానే ఉంది. రాత్రి వేళల్లో ప్రమాదాల బారిన పడుతున్నారు.

అడుగేయలేం..

ఆజాద్‌నగర్ (అనంతపురం): కోవూరు నగర్ వైపు



నుంచి పీటీసీ మైదానం వైపునకు వెళ్లే రహదారి ప్రమాదకరంగా మారింది. వర్షం పడితే మరింత అధ్వానంగా మారుతోంది. పోలీసు శిక్షణా కళాశాల ముందు ద్వారం ఎదుట తారు రోడ్డు దెబ్బతింది. గుంతలు ఏర్పడ్డాయి.

'తెదేపా నేతల లబ్ధికే కొత్త మద్యం విధానం'

అనంతపురం (రాణినగర్), న్యూస్‌టుడే: మద్యం కొత్త విధానం తెదేపా నేతల లబ్ధి కోసమే తీసుకొచ్చారని మాజీ ఎంపీ, వైకాపా జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి విమర్శించారు. మంగళవారం ఆ పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇసుక విధానంలో అధికార యంత్రాంగం భాగస్వామ్యం ఉందన్నారు. కలెక్టర్, ఎస్పీలకు ఆక్రమ ఇసుక రవాణా కన్పించ లేదా అన్నారు. జిల్లా అంతా ఒకే ఒక్క స్టాక్ పాయింట్ పెడితే ఎలాగన్నారు. మద్యం టెండర్లు వేయడంలో ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నా పట్టించుకోకుండా ఉన్నారంటే చంద్రబాబు, లోకేశ్ వాటాలు అందుతున్నాయా అని నిలదీశారు. రాష్ట్రంలో సంపద సృష్టిస్తామన్న చంద్రబాబు ఉన్న సంపదను తెదేపా నేతలకు పట్టకట్టడమే సంపద సృష్టించడమా అని ప్రశ్నించారు.

బురద రాజకీయాలు మానుకోవాలి: మేయర్

అనంత నగరపాలక, న్యూస్‌టుడే: ఐదేళ్లలో అనంత నగరంలో రూ.1045 కోట్లుతో చేసిన అభివృద్ధి కళ్లకు కన్పిస్తుంటే ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ విధ్యాలపై బురద జల్లే రాజకీయాలు చేస్తున్నారని మేయర్ వసీం ధ్వజమెత్తారు. మంగళవారం కార్పొరేటర్లు సైఫుల్లాబేగ్, కమల్ భూషణ్, నరసింహులుతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. నాడు - నేడు ద్వారా నగరంలోని రెండు విడతల్లో రూ.15.70 కోట్లతో పాఠశాలలు అభివృద్ధి చేస్తే ఎక్కడా జరగడం లేదని మాట్లాడటం తగదన్నారు. నగరంలోని ప్రధాన రోడ్లలోనే కాకుండా చిన్న వీధుల్లో కూడా సిమెంటు రోడ్ల నిర్మాణం చేపట్టామన్నారు.